ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	587.60 (305.6242)	3,25,602	3,25,602
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.70 (4.12)	65950.62	5651.42
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	172.209 (41.5360)	2,20,342	2,12,618

చికెన్ ధరలు | లైవ్ : రూ.160 | డ్రెస్ : రూ.220 | స్కిన్‌లెస్ : రూ.255



జిల్లాకేంద్రంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

వైభవంగా ఎంగిలి పూల బతుకమ్మ

వర్షపు జల్లుల నడుమ ఎంగిలి పూల బతుకమ్మ వేడుకలను ఆదివారం సూర్యాపేటలో వైభవంగా జరుపుకున్నారు. తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలను పట్టణంలోని ప్రతీ వీధిలో ప్రతిష్ఠించి సంప్రదాయ పాటలు పాడుతూ మహిళలు ఉత్సాహంగా బతుకమ్మ ఆడారు. దీంతో బస్తీలన్నీ పూల వనాలను తలపించాయి. వివిధ రూపాల్లో బతుకమ్మలను అలంకరించారు. ఆలయాలు, సమీపంలోని వ్యవసాయ బావుల్లో నిమజ్జనం చేశారు. వాయినాలు ఇచ్చిపుచ్చుకొని ప్రసాదాలు పంపిణీ చేశారు. పలువురు ప్రముఖులు వేడుకల్లో పాల్గొని బతుకమ్మ ఆడారు. ఎంగిలి పూల బతుకమ్మ కోసం మునిసిపాలిటీ అన్ని బస్తీలలో వీధి లైట్లు, తదితర ఏర్పాట్లు చేసింది. పోలీసులు ప్రత్యేక పెట్రోలింగ్ నిర్వహించారు.

(ఆంధ్రజ్యోతి-నల్లగొండ కల్చరల్)

8



జిల్లాకేంద్రంలో బతుకమ్మతో వస్తున్న యువతి





ధాన్యం కొనుగోళ్లపై కసరత్తు

- బ్యాంక్ గ్యారంటీలకు ఆదేశాలు
- మిల్లర్ల సమావేశాలు నిర్వహించేందుకు సన్నాహాలు
- దసరా తర్వాత కొనుగోళ్లపై సమావేశాలు

వానాకాలం ధాన్యం కొనుగోళ్లకు ప్రభుత్వం సన్నద్ధమవుతుంటే, క్షేత్రస్థాయిలో పలు అవరోధాలు నెలకొన్నాయి. మిల్లర్ల నుంచి బ్యాంక్ గ్యారంటీలు తీసుకోవాలని, అండర్‌టేకింగ్ అనుమతించ వద్దని పౌర సరఫరాల శాఖ కమిషనర్ ఇప్పటికే ఉత్తర్వులు జారీచేశారు. అయితే ధాన్యం ఉత్పత్తి భారీగా జరిగే ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఈసారి క్షేత్రస్థాయిలో ధాన్యం సేకరణకు ఇబ్బందులను పరిష్కరించాల్సిన అనివార్య పరిస్థితి ప్రభుత్వంపై ఉంది.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)

ఉమ్మడి జిల్లాలో గోదాముల్లో ఖాళీ లేకపోవడంతో మిల్లులు ఇప్పటికే మిల్లింగ్ సామర్థ్యం తగ్గించాయి. గడచిన యాసంగికి సంబంధించిన సీఎంఆర్ బియ్యాన్ని సైతం నిల్వ చేయడానికి ఇబ్బందులు పడుతున్నారు. భారీగా ధాన్యం ఉత్పత్తి వస్తుందనే అంచనా నేపథ్యంలో నిల్వ ధాన్యాన్ని తరలించకపోతే, వానాకాలం కొనుగోళ్లపై ఆ ప్రభావం పడనుందని భావిస్తున్నారు.

బ్యాంకు గ్యారంటీలపై నిర్ణయం

పౌరసరఫరాలశాఖ కమిషనర్ తాజాగా జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం రాబోయే వానాకాలం సీజన్‌లో మిల్లర్ల నుంచి బ్యాంకు గ్యారంటీలు తీసుకోవాలని, ఆ తర్వాతే ధాన్యం కేటాయించాలని సూచించారు. ఈ సారి అండర్‌టేకింగ్ అవకాశం ఇవ్వ వద్దని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. డీఫాల్ట్ మిల్లర్లకు ధాన్యం కేటాయించ వద్దని స్పష్టంగా నిర్దేశించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 243 రైస్ మిల్లులుండగా, అందులో 27 మిల్లులు డీఫాల్ట్ మిల్లులుగా గుర్తించారు. ఈ మిల్లులకు రాబోయే సీజన్‌లో ధాన్యం కేటాయించవద్దని పేర్కొన్నారు. డీఫాల్ట్ అయిన మిల్లుల్లో సూర్యాపేట జిల్లాలో అత్యధికంగా 18 మిల్లులుండగా, నల్లగొండ జిల్లాలో ఏడు, యాదాద్రి భువనగిరి జిల్లాలో మరో రెండు మిల్లులున్నాయి. మిగిలిన మిల్లుల నుంచి సైతం బ్యాంకు గ్యారంటీలు తీసుకోవాలని ప్రభుత్వం సూచించింది. దీంతో కలెక్టర్లు మిల్లర్లతో సమావేశం నిర్వహించి ఈమేరకు బ్యాంకు గ్యారంటీలపై వివరించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

అయితే ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఇంకా సీజన్ ఆరంభం కాకపోవడం, అక్టోబర్ రెండోవారం నుంచి ధాన్యం వచ్చే అవకాశాలుండడంతో ఈలోగా మిల్లర్లతో సమావేశాలు జరిపే అవకాశం కనిపిస్తోంది. గతేడాది సూర్యాపేట జిల్లాల్లో మిల్లర్ల నుంచి కేటాయించే ధాన్యానికి సరిసమానంగా బ్యాంకు గ్యారంటీలు తీసుకున్న ప్రభుత్వం నల్లగొండ, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో మాత్రం అందుకు భిన్నంగా ఇక్కడ మిల్లర్ల సీఎంఆర్ కేటాయింపుల్లో పారదర్శకత, డీఫాల్ట్ లేకపోవడం వంటి కారణాలతో 10 శాతం బ్యాంకు గ్యారంటీతో ధాన్యం కేటాయించింది. ఈసారి ఎలాంటి ప్రతిపాదనలు చేస్తారనే అంశం మిల్లర్ల సమావేశం నిర్వహిస్తే కానీ తెలియడంలేదు.

గోదాములు ఖాళీ చేయకపోతే..

ఉమ్మడి జిల్లాలో ఈ సారి భిన్నమైన పరిస్థితి నెలకొంది. వానాకాలం సీజన్ తరుముకొస్తున్నప్పటికీ ఇంకా గోదాముల్లో నిల్వలు కదలకపోవడంతో మిల్లర్లు ఇవ్వాల్సిన యాసంగి.

- మిగతా 6వ పేజీలో...



నీలగిరిలో విద్యుత్ కాంతులు

నల్లగొండ పట్టణంలో డివైడర్లలో ఏర్పాటు చేసిన విద్యుత్‌లైట్లు

బతుకమ్మ పండుగ సందర్భంగా ప్రత్యేక సుందరీకరణ

రామగిరి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ పండుగ సందర్భంగా తొమ్మిది రోజులపాటు నీలగిరిలో ప్రత్యేక విద్యుత్ కాంతులు విరజిమ్మనున్నాయి. నేటి నుంచి దసరా పండుగ వరకు పట్టణంలోని ప్రధాన రహదారుల్లో వెలుగులు విరజిమ్మేందుకు ప్రత్యేక లైట్లను ఏర్పాటుచేశారు. నల్లగొండ పట్టణంలోని 48 వార్డుల్లో బతుకమ్మ ఆడేందుకు సుమారు 200 కేంద్రాలను గుర్తించి అక్కడ విద్యుత్ లైట్లు, పారిశుధ్యం వంటి ఏర్పాట్లను చేస్తున్నారు. ఎన్జీ కళాశాల మైదానంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ బతుకమ్మలను వల్లభరావు చెరువుకు తీసుకెళ్లేందుకు ట్రాక్టర్, ఆటోలు వంటి వాహనాలను కూడా ఏర్పాటుచేస్తున్నారు. వల్లభరావు చెరువు సమీపంలో బతుకమ్మలను నిమజ్జనం చేసేందుకు 20మంది ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటుచేశారు. వల్లభరావు చెరువులో దోమలు వృద్ధికాకుండా ఆయిల్‌బాల్స్ కూడా ఎప్పటికప్పుడు వేయనున్నారు.

బతుకమ్మకు ప్రత్యేక ఏర్పాట్లు



నల్లగొండలో పండుగ వాతావరణం ఉట్టిపడేలా ప్రధాన రహదారులతోపాటు బతుకమ్మ పాయింట్ల వద్ద ప్రత్యేక విద్యుత్ లైట్లను ఏర్పాటు చేస్తున్నాం. మహిళలు బతుకమ్మను ఆడిన తర్వాత వాటిని వల్లభరావు చెరువులో నిమజ్జనం చేసేందుకు ఆటోలను కూడా ఏర్పాటు చేశాం.

- సయ్యద్ ముసాబ్ అహ్మద్, మునిసిపల్ కమిషనర్, నల్లగొండ

బతుకమ్మకు తంగేడు పూల కొరత

- కానరాని తంగేడు, గునుగు, ముత్యాల పూలు
- బంతి, చామంతి పూల కొనుగోలుకే మహిళల మొగ్గు
- ప్రారంభమైన బతుకమ్మ సంబరాలు



7

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తున్న బతుకమ్మ పండుగకు తంగేడు పూల కొరత ఏర్పడింది. ఇందుకు కారణం అడవులు, చెలకలు, బీడు భూములను చదునుచేసి వెంచర్లు చేయడంతో బతుకమ్మ పూలు కానరాకుండా పోయాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పలు మండలాల్లో తంగేడు పూలను చిన్నచిన్న కట్టలుగా కట్టి రూ.50లకు మూడు కట్టల చొప్పున వీధుల్లో విక్రయించారు.

(ఆంధ్రజ్యోతి-నార్కట్‌పల్లి)

సమావేశాన్ని విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పావులూరి హన్మంతారావు

రామగిరి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలోని బ్రహ్మంగారి మఠంలో ఈ నెల 28న జరిగే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి విశ్వబ్రాహ్మణ సంఘం సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, హార్టికల్చర్ జాయింట్ డైరెక్టర్ పావులూరి హనుమంతరావు కోరారు. జిల్లాకేంద్రంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రస్థాయి సమావేశంలో శ్రీశైలంలోని విశ్వబ్రాహ్మణ అన్నదాన సత్ర నిర్వహణ కమిటీ ఎన్నిక, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ వంటి అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబునాయుడు విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి కార్పొరేషన్ ఏర్పాటు చేసి, ఈశ్వరీ మాత దేవాలయ పునర్నిర్మాణానికి రూ.3కోట్లు కేటాయించారని తెలిపారు. సమావేశంలో స్వర్ణకార సంఘ జిల్లా అధ్యక్షుడు రాచకొండ గిరి, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు కొల్లోజు సత్యనారాయణాచారి, రాగిపణి విష్ణుమూర్తి, కూరెళ్ళ మదనాచారి, దాసోజు వాసుభవాని, తాడూరి చెల్మయ్యాచారి, చొల్లేటి కృష్ణకుమార్, చొల్లేటి లక్ష్మణ్, కంచనపల్లి చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

చెర్వుగట్టుపై వైభవంగా లక్ష పుష్పార్చన



మహామండపంలో ఉత్సవమూర్తులకు లక్షపుష్పార్చన నిర్వహిస్తున్న అర్చకులు

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని శైవక్షేత్రం చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దేవస్థానంపై ఆదివారం లక్ష పుష్పార్చన వేడుక వైభవంగా నిర్వహించారు. అమావాస్య తిథి సందర్భంగా నిర్వహించే ఈ ఉత్సవానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. తొలత గర్భాలయం నుంచి పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ మూర్తులను సన్నాయి వాయిద్యాలు, భక్తుల శివన్నామ స్మరణల మధ్య మహా మండపానికి చేర్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు పోతులపాటి రామలింగేశ్వరశర్మ, ఉప ప్రధాన అర్చకుడు సతీశ్‌శర్మ సహార్చకులు సురేశ్‌శర్మ, శ్రీకాంత్‌శర్మ, వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య విశేష పుష్పాలతో ఉత్సవమూర్తులను అభిషేకించారు. స్వామి పాదాల చెంత పూజలందుకున్న పుష్పాల కోసం భక్తులు పోటీపడ్డారు. స్వామి వారి పుష్కరిణిలో స్నానమాచరించి పార్వతీ జడల రామలింగేశ్వరునితో పాటు గుట్టపైన ఉన్న ఉపాలయాలు, గుట్ట కిందఉన్న పార్వతీ అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు.

పెండింగ్ ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

కల్లుగీత సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అచ్చాలుగౌడ్



చిట్యాల మండలం గుండ్రాంపల్లిలో అనంతుల మల్లేశంగౌడ్‌ను పరామర్శిస్తున్న కల్లుగీత సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పామనగుళ్ళ అచ్చాలుగౌడ్

చిట్యాలరూరల్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న కల్లుగీత కార్మికుల ఎక్స్‌గ్రేషియాను వెంటనే చెల్లించాలని కల్లుగీత సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ జెడ్పీటీసీ పామనగుళ్ళ అచ్చాలుగౌడ్ డిమాండ్ చేశారు. మండలంలోని గుండ్రాంపల్లిలో ఆదివారం ఆయన తాటిచెట్టు పై నుంచి పడి గాయపడిన మల్లేశంగౌడ్‌ను పరామర్శించి మాట్లాడారు. కల్లుగీత కార్మికులు వృత్తినే జీవనాధారంగా చేసుకొని కుటుంబాన్ని పోషించుకుంటారన్నారు. తాటిచెట్టు ఎక్కి ప్రమాదవశాత్తు కిందపడితే వారికి ఎలాంటి జీవనాధారం ఉండదన్నారు. తాటిచెట్లు ఎక్కే గీతకార్మికులకు రక్షణగా ఉండే మోకులను అందించాలన్నారు. అర్హులైన కల్లుగీత కార్మికులకు పింఛన్లు మంజూరు చేయాలన్నారు. సంక్షేమ పథకాలను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం గ్రామ అధ్యక్షుడు బొడిగె అంజయ్యగౌడ్, ప్రధాన కార్యదర్శి బొడిగె రవీందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్ర ఆస్పత్రి సీనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్

ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్

నల్లగొండ, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్ర ప్రభుత్వాస్పత్రిలో సీనియర్ అసిస్టెంట్ కె. భార్గవ్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రభుత్వాస్పత్రిలో ఐసీయూ విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగ జీతాల చెల్లింపులో నిర్లక్ష్యం చేయడంతో సస్పెండ్ చేశారు. తమకు ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు జీతాలు రాలేదని జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని ఐసీయూలో పనిచేసే ఉద్యోగులు ప్రజావాణిలో దరఖాస్తు చేశారు. ఈ విషయంపై విచారణ చేయగా ఐసీయూలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంబంధించి అల్ఫా స్వయంశక్తి సంఘం కాంట్రాక్ట్ సయతః ఏడాది మార్చితో ముగిసింది.

2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కొత్త ఏజెన్సీకి కేటాయించడం లేదంటే, అదే ఏజెన్సీకి రెన్యూవల్ చేసే విషయంపై సీనియర్ అసిస్టెంట్ కె. భార్గవ జిల్లా ఉపాధి కల్పన అధికారికి ఎలాంటి ఫైల్ సమర్పించలేదు. ఈ నేపథ్యంలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల చెల్లింపులో నిర్లక్ష్యం చేసినందుకు సస్పెండ్ చేశారు. క్రమశిక్షణ చర్యల ప్రక్రియ పూర్తి అయ్యేంత వరకు సస్పెండ్‌లో కొనసాగుతారని ముందస్తు అనుమతి లేకుండా ఆయన కార్యస్థానాన్ని వదిలి వెళ్లకూడదని కలెక్టర్ ఆ ఉత్తర్వుల్లో కలెక్టర్ పేర్కొన్నారు.

రైతుల ఆశలపై నీళ్లు

- వరుస వర్షాలతో పత్తి రైతుల్లో ఆందోళన
- తెగుళ్లతో పంటలకు నష్టం



6

పేదల ఇళ్లలో వైద్యకాంతులు

నిరుపేద కుటుంబాల విద్యార్థులు చదువులో సత్తాచాటి ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రభుత్వ కళాశాలల్లో మెడికల్ సీటు సాధించి తల్లిదండ్రుల ఆశలు, ఆశయాలు నెరవేర్చారు. దీంతో వైద్య విద్య వారి దరికి చేరింది.

7

నవరాత్రి ఉత్సవాలకు..

తుల్జా భవాని ఆలయం ముస్తాబు

తొమ్మిది రోజులపాటు ఉపవాస దీక్షలతో గిరిజన భక్తుల పూజలు

దసరా ముందురోజే పండుగ ఉత్సవాలు

నేరేడుగొమ్ము, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): కోరిన కోర్కెలు తీర్చే దైవంగా నేరేడుగొమ్ము మండలం పెద్దమునిగల్ తుల్జా భవాని అమ్మవారికి పేరుంది. నవరాత్రుల ముందు రోజునుంచే గిరిజనులు ఉపవాసదీక్షలతో అమ్మవారికి పూజలు చేస్తారు. దసరాకు ఒకరోజు ముందు అక్టోబరు 1న దేవాలయంలో పండుగ ఉత్సవాలు జరుగుతాయి. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు, మాచర్లతోపాటు రాష్ట్రంలోని హైదరాబాద్, మహబూబ్‌నగర్, నల్లగొండ, నాగర్‌కర్నూల్, ఇతర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేసి మొక్కులు తీర్చుకుంటారు. కోరిన కోర్కెలు నెరవేర్చే దైవంగా తుల్జా భవాని అమ్మవారికి పేరుండడంతో గిరిజనులు కొన్నేళ్లుగా నిష్ఠతో ఉపవాస దీక్షలు చేసి, అమ్మవారిని పూజిస్తారు. మద్యం, మాంసాహారానికి దూరంగా ఉంటారు. ఎక్కువగా ఆవుపాలు, పండ్లు, శాఖాహారం తీసుకుంటారు. దసరా పండుగకు ముందు రోజు ఉపవాస దీక్షలు ముగుస్తాయి. తుల్జా భవాని దేవాలయాన్ని నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబు చేశారు. కృష్ణానదిలో శివాలయం నిర్మించారు. నదిస్నానం చేసి పూజలు చేస్తారు.



నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబైన పెద్దమునిగల్ తుల్జా భవాని దేవాలయం

ఐదు తరాల నుంచి అమ్మవారికి పూజలు



మాతాతలు ఐదు తరాల నుంచి తుల్జా భవాని అమ్మవారికి నిష్ఠతో పూజలు చేస్తున్నారు. నవరాత్రుల సందర్భంగా తొమ్మిది రోజులు ఉపవాస దీక్షతో పూజలుచేస్తాం. ఆవు పాలే తాగుతాం. కోరిన కోర్కెలు నెరవేర్చే దైవంగా తుల్జా భవాని అమ్మవారికి పేరుంది. భక్తులు అధికసంఖ్యలో వచ్చి మొక్కులు చెల్లించుకుంటారు.

- జీవన్‌భగత్, ఆలయ ప్రధాన అర్చకుడు

భార్గవ్.. బరిలో దిగితే

కబడ్డీ, రోప్ స్కిప్పింగ్ పోటీల్లో పతకాలు

జాతీయ స్కిప్పింగ్ పోటీలకు ఎంపిక


పతకాలతో భార్గవ్

భార్గవ్.. బరిలో దిగితే పతకం ఖా యం. సూర్యాపేట జిల్లా హుజూ ర్‌నగర్ మునిసిపాలిటీ పరిధిలోని మాధవరాయనిగూడేనికి చెందిన క్రీడాకారుడు కన్నెగంటి భార్గవచారి క్రీడల్లో రాణిస్తున్నాడు. రాష్ట్ర, జాతీ యస్థాయి క్రీడల్లో ప్రతిభ చూపి పత కాలు సాధించాడు. కబడ్డీ, రోప్ స్కిప్పింగ్ పోటీల్లో తనదైన శైలిలో ఆకట్టుకుంటున్నాడు. ఈ నెల 25 నుంచి 28 వరకు ముంబైలో జరగ నున్న జాతీయ స్కిప్పింగ్ పోటీల్లో ప్రాతినిధ్యం వహించనున్నాడు. ఈ నెల 7న ఘట్‌కేసర్‌లోని ఆచార్య స్పోర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో నిర్వహించి రోప్ స్కిప్పింగ్ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం కైవసం చేసుకున్నాడు.

- ఆంధ్రజ్యోతి, హుజూర్‌నగర్

స్మాష్‌రాకెట్ పోటీలతో పాటు హ్యాండ్‌బాల్, కబడ్డీ పోటీల్లోనూ రాణిస్తున్నాడు. హుజూర్‌నగర్‌లో 2011లో ఎస్‌జీఎఫ్ కబడ్డీ పోటీలు, వాలీబాల్ పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించారు. నల్లగొండలో 2012లో సిల్వర్ మెడల్, 2014-15లో సూర్యాపేటలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో సిల్వర్ మెడల్, 2017-18లో నల్లగొండలో మహాత్మాగాంధీ యూనివర్సిటీలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచాడు. 2019లో సిల్వర్ మెడల్ సాధించాడు. సిద్ధిపేటలో 2022లో జరిగిన సీనియర్ స్టేట్ హ్యాండ్‌బాల్ పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించాడు. కాకతీయ యూనివర్సిటీ స్థాయిలో బ్రౌన్జ్ మెడల్ సాధించాడు. అదేవిధంగా 2022-23లో ఖమ్మం, వరంగల్‌లలో స్మాష్ రాకెట్, బ్యాడ్మింటన్, త్రోబాల్ పోటీల్లో మొదటి స్థానం సాధించి బంగారు పతకం సాధించాడు. 2023లో హైద్రాబాద్‌లో జరిగిన త్రోబాల్ పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించాడు. 2025 సెప్టెంబరు 7న ఘట్‌కేసర్‌లో జరిగిన రోప్ స్కిప్పింగ్‌లో రాష్ట్ర స్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించాడు. భార్గవ్ హుజూర్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీబీజడ్‌సీ, ఖమ్మం యూనివర్సిటీలో బీపీఈడీ, పంజాబ్ సాయి అకాడమిలో ఎన్ఐఎస్, ఆంధ్రకేసరి యూనివర్సిటీ ఒంగోలులో ఎంపీఈడీ చదివాడు.

జాతీయ క్రీడల్లో రాణించడమే లక్ష్యం



జాతీయ స్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించడమే లక్ష్యం. అందుకోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నాను.ప్రభుత్వం నుంచి సహాయ, సహకారాలు అందిస్తే మరిన్ని పతకాలు సాధించేందుకు కృషి చేస్తా. కుటుంబసభ్యుల సహకారం, గ్రామపెద్దల ప్రోత్సాహంతో రాష్ట్రస్థాయిలో బంగారు పతకాలు సాధించా.

- కన్నెగంటి భార్గవ్

వాగు మధ్యలో చిక్కుకున్న కారు

• కారు వదిలేసి ప్రాణాలతో బయటపడిన డ్రైవర్

సంస్థాన్ నారాయణపురం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): వాగులో మధ్యలో చిక్కుకోవడంతో కారును వదిలేసి డ్రైవర్ ప్రాణాలు దక్కించుకున్నాడు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణపురం మండలం పుట్టపాక, గట్టుప్పల్ గ్రామాల మధ్యన ఆర్మల్ల వాగులో శనివారం రాత్రి జరిగింది. శనివారం కురిసిన వర్షానికి ఈ వాగులో వరద ఉధృతి పెరిగింది. అదే సమయంలో చౌటుప్పల్ నుంచి గట్టుప్పల్‌కు కారులో ఓ వ్యక్తి బయలు దేరాడు. వాగు వద్దకు వచ్చినప్పటికీ వాగు ప్రవహిస్తుంది, వాగులో వరదను అంచనా వేయలేక కారుతో వాగు దాటేందుకు ముందుకు సాగాడు. వాగు మధ్యలోకి వెళ్లే సరికి వరద ఉధృతి పెరగడంతో కారు ముందుకు వెళ్లలేక వాగులో చిక్కుకుంది. ఎంత ప్రయత్నించినా కారు వాగులో నుంచి ముందుకు కదలలేదు. దీంతో కారును వాగులోనే వదిలేసి కారులో నుంచి దిగి డ్రైవర్ ప్రాణాలు దక్కించుకున్నాడు. ఆదివారం ఉదయం వరద ఉధృతి తగ్గడంతో వాగులో చిక్కుకున్న కారును తీసుకెళ్లాడు.

కుక్కల దాడిలో గొర్రెలు మృత్యువాత



భువనగిరి రూరల్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలం అనంతారంలో కుక్కల దాడిలో తొమ్మిది గొర్రెలు మృతుయవాతపడ్డాయి. గ్రామానికి చెందిన జల్లి రాములు గొర్రెల మందపై కుక్కలు దాడి చేసి తొమ్మిది గొర్రెలు మృత్యువాతపడ్డాయి. మరో 10 గొర్రెలకు గాయాలయ్యాయి. గొర్రెల విలువ సుమారు రూ.95వేలు ఉటుందని బాధితుడు తెలిపాడు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం జిల్లా కార్యదర్శి దయ్యాల నర్సింహ ప్రభుత్వాన్ని కోరారు.

విద్యుదాఘాతంతో పాడిగేదె

శాలిగౌరారం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందింది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలంలోని గురజాల గ్రామంలో జరిగింది. గురజాల గ్రామంలో ఎర్ర సత్తయ్యకు చెందిన పాడి గేదె రోజు మాదిరిగానే పక్కనున్న చేలలోకి మేతకు వెళ్లింది. పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకడంతో విద్యుదాఘాతంతో మృతిచెందినట్లు బాధిత రైతు తెలిపాడు. గేదె విలువ సుమారు రూ.80వేల వరకు ఉంటుందని తెలిపాడు.

ధాన్యం కొనుగోళ్లపై కసరత్తు

(5వ పేజీ తరువాయి)

సీఎంఆర్ బియ్యం సేకరణ మందకొడిగా సాగుతోంది. ఇప్పటికే మిల్లుల్లో, మిల్లులకు సంబంధించిన గోదాముల్లో ధాన్యం, బియ్యం పేరుకుపోయాయి. ప్రభుత్వానికి సంబంధించి గోదాముల్లోనే వంద శాతం నిల్వ సామర్థ్యానికి మించి ధాన్యం, బియ్యం నిండిపోవడంతో మిల్లింగ్ చేసే పరిస్థితి లేక జిల్లా వ్యాప్తంగా మిల్లుల సామర్థ్యం తగ్గించి నడుపుతున్నారు. కొన్ని మిల్లులను పూర్తిగా నిలిపివేశారు. గోదాముల్లో ధాన్యం ఖాళీచేసి, మిల్లుల్లో ఉన్న సీఎంఆర్ బియ్యాన్ని తరలించకపోతే వానాకాలం ధాన్యం తీసుకొని మిల్లింగ్ చేయలేమని మిల్లర్లు పేర్కొంటున్నారు. ఈ విషయమై ఇప్పటికే కలెక్టర్లకు, పౌర సరఫరాల శాఖ అధికారులకు పలుమార్లు తాము సమస్యను వివరించామని చెబుతున్నారు. ప్రభుత్వం ఉన్నతస్థాయిలో నిర్ణయం తీసుకోవాలని, గోదాములలో నిల్వలు తగ్గించేందుకు అవసరమైన ఎగుమతులు చేయలేకపోతే, ప్రైవేట్ గోదాములైనా కిరాయికి తీసుకొని తమకు కేటాయించాలని మిల్లర్లు చెబుతున్నారు. ఒక్క నల్లగొండ జిల్లానే పరిశీలిస్తే జిల్లాలో 31 గోదాముల్లో 5,35,235 మెట్రిక్‌టన్నుల నిల్వ సామర్థ్యముండగా, వాటిల్లో దాదాపు వంద శాతం సామర్థ్యం మేర నిల్వలు పేరుకుపోయాయని తెలుస్తోంది. ఇందులో ఎఫ్‌సీఐ తీసుకోవాల్సిన 2,46,267 మెట్రిక్ టన్నుల బియ్యానికి అనుమతులు తీసుకోవడంతోపాటు, రవాణాకు సంబంధించిన రైల్వే ర్యాకులు వచ్చేందుకు రాష్ట్ర సివిల్ సప్లయిస్ సంస్థ చొరవ తీసుకోవాలని, లేకపోతే మిల్లులు నడిపే పరిస్థితి లేదని మిల్లర్లు చెబుతున్నారు.

వానాకాలంలో భారీ ఉత్పత్తి అంచనా..

ఈ వానాకాలం సీజన్‌లో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 29.98 లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం ఉత్పత్తి ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఇందులో 14.37లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని భావిస్తున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా దాదాపు 1000కి పైచిలుకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం ద్వారా ధాన్యం సేకరణ జరుగుతుంది. అయితే ఈసారి వానాకాలం సీజన్‌లో సన్న ధాన్యం ఉత్పత్తి ఎక్కువగా ఉండడంతో మిల్లర్ల కొనుగోళ్లు పోటాపోటీగా ఉంటాయని, అందువల్ల ప్రభుత్వరంగ సంస్థల కొనుగోళ్లు తక్కువగా ఉంటాయని భావిస్తున్నారు. అయితే ఎలాంటి పరిస్థితి అయినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా, అంచనా మేరకు కొనుగోళ్లు జరిగేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొంటున్నారు. దసరా తర్వాత జరిగే మిల్లర్ల సమావేశాల్లో అన్ని అంశాలు చర్చించి నిర్ణయం తీసుకుంటారని చెబుతున్నారు.

జిల్లా	మిల్లులు	డీఫాల్ట్	ధాన్యం ఉత్పత్తి అంచనా	కొనుగోళ్ల అంచనా
నల్లగొండ	122	7	12.00	6.00
సూర్యాపేట	71	18	11.98	4.37
యాదాద్రి	50	02	6.00	4.00
మొత్తం	243	27	29.98	14.37

రైతుల ఆశలపై నీళ్లు

• వరుస వర్షాలతో పత్తి రైతుల్లో ఆందోళన • తెగుళ్లతో పంటలకు తీరని నష్టం


గుండాల మండలంలో ఎర్ర తెగులు సోకిన పత్తి చేను

ఎన్నో ఆశలతో సాగుచేసిన పత్తి పంట ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఆందోళన చెందుతున్నారు. కాత దశలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో కాయ నల్లగా మారుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజూ కురుస్తున్న వర్షాలతో పత్తి చేను తడారడం లేదు. అధిక వర్షాలతో పత్తిచేను ఎర్రతెగులు సోకడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆకులు ఎర్రగా మారి క్రమంగా చేను మొత్తానికి ఈ తెగులు సోకుతోంది.

ఆంధ్రజ్యోతి, గుండాల

యాదాద్రిభువనగిరి జిల్లాలో రైతులు జిల్లాలో 1.13 లక్షల ఎకరాల్లో రైతులు పత్తి పంట సాగు చేశారు. దుక్కులు దున్నడం, విత్తనాలు, ఎరువులు, కలుపుతీత కలిపి ఇప్పటికే ఎకరాకు సుమారు రూ.30వేల వరకు ఖర్చు చేశారు. ఈ లెక్కన జిల్లా వ్యాప్తంగా రూ.339 కోట్ల వరకు పెట్టుబడి పెట్టారు. అధిక వర్షాల వల్ల రైతులకు సాధారణంగా వచ్చే పెట్టుబడి కంటే ఈ సంవత్సరం అధికంగా వచ్చింది. సాధారణంగా పత్తి పంటకు ఎకరాకు రూ.30 వేల వరకు పెట్టుబడి అవుతుంది. దిగుబడి ఆశాజనకంగా ఉంటే ఎకరాకు 10 నుంచి 15 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. అధిక వర్షాలతో తెగుళ్ల సోకి దిగుబడి తగ్గే అవకాశముంది. వర్షాలు ఎక్కువగా కురుస్తుండడంతో తెగుళ్ల నివారణకు పురుగు మందులు పిచికారీ, కూలీల ఖర్చు కలిపి ఎకరాకు రూ.10 వేల వరకు అదనంగా పెట్టుబడి పెట్టాల్సి వచ్చిందని రైతులు వాపోతున్నారు. వర్షాలకు పగిలిన పత్తి నాని గుబ్బలలో పత్తి ఇరుక్కపోవడంతో కాయలుగా మారడంతో పత్తి తీత ఆలస్యమవుతోంది. వర్షానికి పత్తి నల్లగా మారుతుండడం, పత్తిలో కాయలు ఉండడంతో వ్యాపారులు పత్తి కొనుగులో చేయడంలో జాప్యం చేస్తూ తక్కువ ధరకు అడుగుతున్నారని రైతులు ఆవేదన చెందుతున్నారు.

అధిక వర్షాలతో తీవ్రంగా నష్టపోయాం



నాకు ఉన్న రెండు ఎకరాల భూమితో పాటు మరో 10 ఎకరాలు కౌలుకు తీసుకుని పత్తి పంటను సాగు చేశాను. అధిక వర్షాలతో ఎకరాకు 3 నుంచి 4 క్వింటాళ్ల దిగుబడి వచ్చే పరిస్థితి ఉంది దీంతో తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. పంటకు పెట్టిన పెట్టుబడి వచ్చే పరిస్థితి లేక పోవడంతో పంటకు తెచ్చిన అప్పులు ఎలా చెల్లించాలో అర్థం కావడం లేదు. అదనంగా కౌలు డబ్బులు మీద పడే పరిస్థితి నెలకొంది.

● మచ్చ శివారెడ్డి, సీతారాంపురం, గుండాల మండలం

ఎక్కువ మంది కూలీలు అవసరమవుతున్నారు



ఇటీవల కురుస్తున్న వర్షాలకు పత్తి నానడంతో పత్తి తీసేందుకు కూలీలు ఎక్కువ మంది అవసరమవుతున్నారు. దిగుబడి తగ్గుతుండడంతో పంటకు పెట్టిన పెట్టుబడి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. తడిసిన పత్తి కొనేందుకు వ్యాపారులు కూడా ముందుకు రావడం లేదు. వారు అడిగిన ధరకు ఇచ్చి రావాల్సి వస్తుంది. దీంతో తీవ్రంగా నష్టోపోతున్నాం.

తీరుపల్లి శ్రావన్‌రెడ్డి, సీతారాంపురం, గుండాల మండలం.


ఆలుగు పోస్తున్న మల్కాపురం చెరువు

ఇటు చెరువులకు జలకళ

చౌటుప్పల్ రూరల్: యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలోని పలు చెరువులకు జలకళ సంతరించుకుంది. నాలుగు సంవత్సరాల తర్వాత చెరువులు నిండి ఆలుగుపోస్తుండటంతో రైతులు అనందం వ్యక్తం చేస్తున్నారు. మూసీ ప్రాంతం చెరువులు గతంలోనే నిండినిప్పటికి చౌటుప్పల్ దక్షణ భాగంలోని చెరువులకు నీళ్లు రాక పోవడంతో నిరుత్సహంగా ఉండేవారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షలతో రాచకొండ గుట్టలు ఖైలారం గుట్టల నుంచి భారీగా వరద నీరు ప్రవహిస్తుండడంతో దేవలమ్మనాగారం, దండుమల్కాపురంలోని పెద్ద చెరువు, శేషరాజుకుంట, తెప్పలచెరువు, ఖైతుపురం చెరువులు నిండి ఆలుగుపోస్తున్నాయి. తంగడపల్లి చెరువులోకి వరద ప్రవాహం పెరిగింది. 30శాతం వరకు నిండింది. నాలుగు సంవత్సరాల తర్వాత చెరువులు నిండటంతో అన్నదాతలు, మత్సకార్మికులు సంబరాలు చేసుకుంటున్నారు. ఈ ప్రాంతంలో చెరువులు నిండటంతో రెండు సంవత్సరాల వరకు సాగునీటి సమస్య తీరినట్టేనని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని దేవలమ్మనాగారం, దండుమల్కాపురం, చిన్నకొండూరు గ్రామాల్లో వరి, పత్తి పంటలకు నష్టం వాటిల్లింది. 70ఎకరాల్లో వరి పంట, 10ఎకరాల్లో పత్తి పంటకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ అధికారి నాగరాజు తెలిపారు. నష్టం వివరాలు ఉన్నతాధికారులకు అందజేస్తామని ఆయన తెలిపారు.

లక్కారం చెరువులోకి వరద

చౌటుప్పల్ టౌన్: యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మునిసిపా లిటీలోని లక్కారం పెద్ద చెరువులోకి వరద నీరు చేరుకుంటుంది. తెప్పల చెరువు నుంచి కాల్వ ద్వారా వచ్చే వరద నీటితో దండు మల్కాపురం, ఖైరతాపురం చెరువులు నిండి అలుగు పోస్తున్నాయి. దీంతో లక్కారం చెరువులోకి వరద నీటి ప్రవాహం పెరిగింది. మూడు సంవత్సరాల తర్వాత లక్కారం చెరువులోకి నీరు చేరుకుంటుంది. లక్కారం చెరువులోకి వరద నీరు ప్రవహిస్తుండడంతో రైతులు, ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఈ చెరువులోకి చేరుకునే నీటితో భూగర్భ జలాలు పెరిగి కొంత మేరకు సాగు నీటి సమస్య తీరే అవకాశాలున్నాయి.

కృష్ణానదిలో వ్యక్తి గల్లంతు

• నదిలో దిగి స్నానం చేస్తుండగా ప్రమాదం
• గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు



గాలింపు చర్యలు చేపడుతున్న పోలీసులు, రాంబాబు(ఫైల్)

నాగార్జునసాగర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ పైలాన్‌కాలనీ శివాలయం పుష్కర ఘాట్ వద్ద ఆదివారం ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. సాగర్ ఎస్‌ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం... హైదరాబాద్‌లోని చింతల్‌కు చెందిన గిరిశెల రాంబాబు(45) హైదరాబాద్‌లోని మైలాన్ ఫార్మా కంపెనీలో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం సెలవురోజు కావడంతో భార్య సుహాసిని, ఇద్దరు కుమారులతో కలిసి సాగర్ సందర్శనకు వచ్చాడు. శివాలయం పుష్కరఘాట్ వద్ద నదిలో దిగి స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు వరద ఉధృతికి కృష్ణానదిలో కొట్టుకుపోయాడు. వరద ఉధృతి ఎక్కువగా ఉండడంతో జాలర్ల సాయంతో శివాలయం ఘాట్ వద్ద ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేకుండాపోయింది. రాంబాబు భార్య సుహాసిని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి

నూతనకల్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో విద్యార్థి మృతిచెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా నూతన్‌కల్ మండలంలోని చిన్ననేమిల క్రాస్‌రోడ్ దగ్గర ఆదివారం జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మద్దిరాల మండలం చిన్ననేమిల గ్రామానికి చెందిన నిమ్మరబోయిన శ్రీనివాస్, ఉమ దంపతుల చిన్న కుమారుడు జీవన్(14) అదే గ్రామంలో 8వ తరగతి చదువుతున్నాడు. సెలవులు వచ్చినపుడు చిన్ననేమిల క్రాస్ రోడ్‌లో డీజే నిర్వహించే లింగాల అంజయ్య వద్దకు పనికి వెళ్తుంటాడు. ఆదివారం ఎంగిలి పువ్వు బతుకమ్మ సందర్భంగా డీజే అద్దెకు ఉంటాయని అంజయ్య పిలవడంతో వచ్చాడు. వర్షం రావడంతో డీజే వాహనాన్ని ఇంటి ముందు ఉంచి వర్షానికి తడవకుండా పట్టాకప్పుతుండగా పైన ఉన్న 11కేవీ విద్యుత్ వైరుకు మెడ, తల భాగాలు తగలడంతో విద్యుదాఘాతానికి గురై కింద పడిపోయాడు. చికిత్స నిమిత్తం 108లో సూర్యాపేటకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. అప్పటిదాకా కళ్ల ముందు ఉన్న కుమారుడు మృతిచెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రావుల నాగరాజు తెలిపారు.

పువ్వుకోసం చెట్టు ఎక్కి..

మోత్కూరు: బతుకమ్మ పేర్చడానికి పువ్వు తేవడానికి వెళ్లిన యువకుడు విద్యుదాఘాతానికి గురయ్యాడు. ఈ సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మునిసిపల్ కేంద్రంలో ఆదివారం జరిగింది. కొప్పుల సాత్విక్‌రెడ్డి అనే యువకుడు టేకుపువ్వు కోయడానికి టేకుచెట్టు ఎక్కాడు. చెట్టులోంచి విద్యుత్ తీగలు(లైన్) వెళ్లాయి. చెట్టు కొమ్మల్లో ఉన్న విద్యుత్ తీగను గమనించకుండా సాత్విక్‌రెడ్డి పువ్వు కోస్తుండగా విద్యుత్ తీగ తగిలి ముఖానికి గాయాలయ్యాయి. చికిత్సనిమిత్తం భువనగిరి ఆస్పత్రికి తరలించారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ప్రైవేటు కంపెనీ ఉద్యోగి మృతిచెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలకేంద్రంలోని లక్ష్మీపురంలో ఆదివారం జరిగింది. ఏఎస్‌ఐ ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం... మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రాంబిహారి (35) నార్కట్‌పల్లిలోని రాశీ రిఫ్యాక్టరీస్ లిమిటెడ్ పరిశ్రమలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. కంపెనీకి చెందిన ఉద్యోగుల క్వార్టర్స్‌లోనే ఓ గదిలో ఒక్కడే ఉంటున్నాడు. శుక్రవారం విధులకు హాజరై సాయంత్రం క్వార్టర్స్‌లోని నివాసానికి చేరిన రాంబిహారీ తిరిగి బయటికి రాలేదు. కుటుంబ సభ్యులు ఫోన్‌చేసినా అతని నుంచి స్పందన లేకపోవడంతో వారు కంపెనీకి చెందిన మరో నెంబర్‌కు ఫోన్ చేసి రాంబిహారీతో మాట్లాడించాలని కోరారు. కంపెనీ ఉద్యోగులు రాంబిహారీ ఉన్న గదికి వెళ్లి చూడగా గది నుంచి దుర్వాసన వచ్చింది. దీంతో అనుమానించి 100 కాల్ ద్వారా పోలీస్‌లకు సమాచారం ఇచ్చారు. అక్కడికి వెళ్లి గది తలుపులు తెరిచి చూడగా అప్పటికే విగతజీవిగా పడి ఉండగా శరీరమంతా ఉబ్బింది. విద్యుత్ షాక్‌తోనే మృతిచెందినట్లు అనుమానిస్తున్నామని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. ఈ ఘటనకు సంబంధించి ఇంకా ఫిర్యాదు అందలేదని ఏఎస్‌ఐ తెలిపారు.

ప్రమాదాలకు నిలయంగా..

- హైదరాబాద్-నాగార్జునసాగర్ హైవేపై వాహనాల రద్దీ
- కన్పించని హెచ్చరిక, సూచికబోర్డులు
- నాగార్జునసాగర్ గేట్లు తెరవడంతో పర్యాటకుల తాకిడి

హైదరాబాద్-నాగార్జునసాగర్ హైవే ప్రధాన రాష్ట్ర రహదారిపై వాహనాల రద్దీ పెరుగుతోంది. ఈ రహదారిపై నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఎక్కడో ఒక చోట ప్రమాదాలు జరుగుతున్నాయి. నాగార్జునసాగర్ ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో వందలాది వాహనాల్లో పర్యాటకులు వస్తున్నారు. సాగర్-హైదరాబాద్ రాహదారిపై కల్వర్టులు, ప్రమాదకరంగా మూల మలుపుల కారణంగా నిత్యం ఎక్కడో ఓ చోట ప్రమాదాలు జరుగుతుండడంతో స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు.

- ఆంధ్రజ్యోతి, చింతపల్లి


చింతపల్లి నుంచి నసర్లపల్లి వద్ద సూచికలు లేక ప్రమాదకరంగా మూలమలుపు

ప్రమాదకరంగా మారిన ప్రాంతాల్లో ఆర్‌అండ్‌బీ అధికారులు కనీసం హెచ్చరిక, సూచిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో రహదారి గురించి వాహనదారులకు సరైన అవగాహన లేకపోవడంతో ప్రమాదాలు పెరుగుతున్నాయి. నాగార్జునసాగర్-హైదరాబాద్ హైవే చింతపల్లి మండలంలో సుమారుగా 32కిలో మీటర్ల దూరం వ్యాపించి ఉంది. అతివేగం,నిద్రమత్తు,అజాగ్రత్తతో పాటు కొంతమంది యువత మద్యం సేవించి వాహనాలు నడుపుతుండడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

రోడ్డు ప్రమాదాలకు కారణాలు ఇవే..

ప్రమాదకరంగా మారిన ప్రాంతాల్లో ఎలాంటి హెచ్చరిక, సూచిక వేగ నియంత్రణ తెలిపే బోర్డులు లేవు. హైవే సమీపంలో బెల్‌షాపులు ఉండడంతో డ్రైవర్లు మద్యం సేవించి నడపడంతో రహదారిపై ప్రమాదాలు జరుగుతున్నాయి. నల్లగొండ జిల్లా చింతపల్లిమండలంలోని మదనాపురంగేట్ నుంచి రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలానికి వెళ్లే ప్రాంతంలో ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. చింతపల్లి మండలంలోని ప్రశాంతి పూరితండా, కుర్మేడ్ గేట్, విరాట్‌నగర్‌కాలనీ సమీపంలో రోడ్డు ప్రమాదకరంగా ఉంది. ధైర్యపూరితండా, చింతపల్లి, నసర్లపల్లి గ్రామాల సమీపంలో, కొండమల్లేపల్లి మండలంలోని శేరిపల్లి, చెన్నారం, పీఏపల్లి మండలంలోని పలు ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదకరంగా మారాయి.

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటాం

సాగర్-హైదరాబాద్ రాష్ట్ర రహదారిని పరిశీలించి ప్రమాదాల నివారణకు సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తాం. వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు మూల మలుపుల వద్ద వేగ నియంత్రణ కట్టలు వేసేందుకు చర్యలు తీసుకుంటాం.

- ప్రభాకర్, ఆర్‌అండ్‌బీ ఈఈ (దేవరకొండ).

క్లిక్ క్లిక్ click



భూమికి పచ్చాని రంగేసినట్టు..

భూమికి పచ్చాని రంగేసినట్లు కనిపిస్తున్న ఈ ప్రాతం నల్లగొండ జిల్లా శాలిగౌరారం ప్రాజెక్టు కింద సాగు చేసిన పంట పొలాలు పచ్చదనంగా కనిపిస్తూ కనివిందు చేస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు, చెరువులు, కుంటలు నిండడంతో పాటు భూగర్భజలాలు పెరిగాయి. శాలిగౌరారం ఎక్కడ చూసినా పచ్చని పంటలు కళకళ లాడుతున్నాయి. అన్ని పంటల కంటే ఎక్కువగా వరి పంటను ఎక్కువగా రైతులు సాగు చేస్తుండడంతో ఎక్కడ చూసినా పంటలు పచ్చని రంగేసినట్లు కనిపించడంతో చూపులను ఆకట్టుకున్నాయి.

- ఆంధ్రజ్యోతి, శాలిగౌరారం

ఇసుక తరలిస్తున్న లారీ పట్టివేత

ఆత్మకూరు(ఎం) సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీని పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. సీఐ హనుమంతు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రిభువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలంలోని కూరెళ్ల గ్రామా శివారులో ఇసుక డంపు నిల్వ చేసి, లారీలతో తరలిస్తున్నట్లు గ్రామస్థుల సమాచారం మేరకు పోలీస్ సిబ్బంది వెళ్లి, ఇసుక లోడ్ చేసిన లారీ స్వాధీనం చేసుకొని పోలీస్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కొంత మంది ట్రాక్టర్లతో ఇసుకను తరలించి, కూరెళ్ల శివారులో డంపు చేసి రాత్రి సమయంలో లారీలకు ఎత్తుతున్నట్లు గ్రామస్థులు ఆరోపించారు

బతుకమ్మకు తంగేడుపూల కొరత



మోటకొండూరులో అరకొరగా పూసిన తంగేడు పూవ్వు

● బంతిపూలతో బతుకమ్మల తయారీ
● ప్రారంభమైన బతుకమ్మ సంబరాలు

మోటకొండూరు/ నార్కట్‌పల్లి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తున్న బతుకమ్మ పండుగకు ఒకప్పుడు గ్రామశివార్లలో తంగేడు, గునుగు, అడవి చామంతి, ముత్యాల పూలు అధికంగా కనిపించేవి. కానీ ప్రస్తుతం బతుకమ్మను పేర్చడానికి ఉపయోగించే తెలంగాణ పుష్పం తంగేడు, గునుగు, అడవి చామంతి వంటి పూల కొరత ఏర్పడింది. ఇందుకు కారణం అడవులు, చెలకలు, బీడు భూములను చదువు చేసి వెంచర్లు చేయడంతో బతుకమ్మ పూలు కనుమరుగవుతున్నాయి. ఒకప్పుడు బతుకమ్మ పండుగ వస్తుందంటే చాలు మహిళలు పంటపొలాలకు పనులకు వెళ్లి ఇంటికి తిరిగి వచ్చే క్రమంలో తంగేడు, గునుగు, అడవి చామంతి వంటి పలు రకాల పూలను వెంట తీసుకొచ్చి పండుగ రోజున పూలకు రంగు, రంగుల, రంగులు అద్ది తిరోక్కపూలతో పోటాపోటీగా బతుకమ్మలను పేర్చేవారు.

ఇతర పూలతో బతుకమ్మ అలంకరణ

తంగేడు పూలు దొరకక రోడ్ల పక్కన పెరిగే హైబ్రిడ్ తంగేడు, టేకు చెట్ల పూలతో బతుకమ్మను పేర్చుతున్నారు. బంతి పూలు కిలోకు రూ.100 చొప్పున విక్రయించారు. రంగులద్దిన గడ్డి సోంప పూవును కూడా పేర్చి బతుకమ్మలకు అందాలను తెచ్చారు. పూలను పూజించే సంస్కృతికి అద్దం పట్టారు.

పూలు దొరకడం లేదు..



గతంలో గ్రామ శివారులో ఉన్న చెలకల్లో, బీడు భూముల్లో కావాల్సినంత తంగేడు, గునుగు, ముత్యాల పూలు దొరికేవి. కానీ నేడు అంతటా భూములను వెంచర్లుగా మార్చడంతో పూల కొరత ఏర్పాడింది. గ్రామ శివారుకు వెళ్లి తీరొక్క పూలను తీసుకువచ్చి నిలువెత్తు బతుకమ్మలను పేర్చే వాళ్లం. బతుకమ్మలతోనే సరిపెడుతున్నాం.

-బచ్చు శ్రీలత, మోటకొండూరు

పూల ధరలు ఎక్కువగా ఉన్నాయి



మార్కెట్‌లో రూ.100లకు కిలో బంతి పూలు మాత్రమే వస్తున్నాయి. వాటికి తోడు చామంతి పూలను కొనుగోలు చేసి బతుకమ్మను పేర్చుతున్నాం. ఇలా తొమ్మిది రోజులు పూలను కొనుగోలు చేసి బతుకమ్మను పేర్చాలంటే చాలా డబ్బులు ఖర్చవుతాయి. చాలామంది బంతిపూలతో చిన్న బతుకమ్మలను పేర్చి సరిపెడుతున్నారు.

-ఎత్తరి మంజుల, మోటకొండూరు

గోంగూర చెట్టు @ 15 అడుగులు



గరిడేపల్లి మండలం అప్పన్నపేటలో గోంగూర చెట్టుతో అల్లుబెల్లి కృష్ణారెడ్డి, సరోజనమ్మ

సాధారణంగా గోంగూర చెట్టు 3-4 నెలలు మాత్రమే ఉంటుంది. గరిష్ఠంగా 6 అడుగుల ఎత్తు వరకు ఎదుగుతాయి. కానీ సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం అప్పన్నపేట గ్రామానికి చెందిన విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు అల్లుబెల్లి కృష్ణారెడ్డి ఇంట్లో ఉన్న గోంగూర చెట్టు ఒక ప్రత్యేక ఆకర్షణగా మారింది. సంవత్సరం పాటు నిలిచి సుమారు 15 అడుగుల మేర ఎత్తు పెరిగిన ఈ గోంగూర చెట్టు గుబురుగా పెరిగి, విస్తారంగా ఆకులు ఇస్తుంది. కృష్ణారెడ్డి భార్య సరోజనమ్మ మాట్లాడుతూ ఈ చెట్టు నుంచి తీసిన గోంగూరను, అమెరికాలో ఉంటున్న తమ కుమార్తెకు రెండుమార్లు పంపినట్లు ఆమె తెలిపారు. ఇంట్లో నాటిన చిన్న మొక్క ఎత్తుగా పెరిగి సంవత్సరం మొత్తం గోంగూరను అందిస్తుండటంతో గ్రామంలో ఆసక్తి రేకిస్తుండడంతో ఆ చెట్టును చూడడానికి గ్రామస్తులు తరలివచ్చి చూసి ఆశ్చర్యం వ్యక్త పరుస్తున్నారు. (ఆంధ్రజ్యోతి -గరిడేపల్లి)

పేదల ఇళ్లలో 'వైద్య' కాంతులు

● నిరుపేద విద్యార్థులకు మెడికల్ సీట్లు

నిరుపేద కుటుంబాల విద్యార్థులు చదువులో సత్తాచాటి ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రభుత్వ కళాశాలల్లో ఉచిత మెడికల్ సీటు సాధించి తమ కలలను సాకారం చేసుకున్నారు. తల్లిదండ్రుల ఆశలు, ఆశయాలకు అనుగుణంగా లక్ష్యసాధనకు నిరంతరం తపించారు. విలువైన వైద్య విద్య వారి దరికి చేరింది. వారు మాట్లాడుతూ వైద్య విద్య పూర్తిచేసి, మారుమూల గ్రామాల్లో ప్రజలకు వైద్యం అందించడమే తమ లక్ష్యమని ప్రకటిస్తున్నారు. (ఆంధ్రజ్యోతి- న్యూస్ నెట్‌వర్క్)



శైలజ

(ఆంధ్రజ్యోతి-భువనగిరి రూరల్) యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం ఆకుతోట బావి తండాలోని నిరుపేద కుటుంబానికి చెందిన కేతావత్ తిరుపతి నాయక్ శారద దంపతుల కుమార్తె శైలజ. చిన్నప్పటి నుంచి ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యను అభ్యసించింది. తన ప్రతిభను కనబరిచి ములుగు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించింది. ఈ సందర్భంగా శైలజ మాట్లాడుతూ తండాల్లో ప్రజలు సరైన వైద్య సదుపాయాలు అందక ఎంతో మంది ప్రాణాలు కోల్పోవడం చూసి డాక్టర్ కావాలనే లక్ష్యంతో కష్టపడ్డాను. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు విద్యా సంస్థలో ఎంబీబీఎస్ లాంగ్‌టర్మ్ కోచింగ్ తీసుకుని ఎంబీబీఎస్ సీటును సాధించినట్లు తెలిపారు. తల్లిదండ్రులు, గ్రామస్తులు శైలజను అభినందించారు.

పేదింటి విద్యా కుసుమం



క్రాంతికిరణ్

మోత్కూరు : మోత్కూరు మండలం అనాజిపురం గ్రామానికి గుండు వెంకటేశ్వర్లుది నిరుపేద కుటుంబం. ఆయన కుమారుడు క్రాంతికిరణ్ 2025 నీట్ పరీక్షలో 1,578 ర్యాంకు సాధించి, వనపర్తి ప్రభుత్వ వైద్యకళాశాలలో సీటు సాధించాడు. దీంతో క్రాంతికిరణ్‌ను సినీ గేయ రచయిత అభినయ శ్రీనివాస్, ప్రజాభారతి అధ్యక్షుడు బోళ్ల హనుమంతు అభినందించారు.

లక్ష్మీనృసింహులకు శాస్త్రోక్తంగా నిత్యపూజలు



నిత్య కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్టలో లక్ష్మీ నృసింహులకు శాస్త్రోక్తంగా నిత్యపూజలు నిర్వ హిం చారు. ఎంగిలి పూల బతుకమ్మ కారణంగా ఇష్టదైవాలను దర్శించుకునేందుకు భక్తులు సాధారణ సంఖ్యలో వచ్చారు. ఉభయ (ప్రత్యేక, దర్మదర్శనం) క్యూ లైన్లు భక్తులతో ఉదయం నుంచి రాత్రి వరకు సాధారణ రద్దీ కొనసాగింది. కొండకింద ఆధ్యాత్మిక వాడలు, కొండపైన బస్టాం డు ప్రాంగణం, ప్రధానాలయం, కల్యాణోత్సవం, వ్రత మండపాలు, ఆలయ తిరువీధులు, ప్రాకార మండపాలు, ప్రసాద విక్రయశాల వద్ద కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ఆలయ ఉత్తర దిశలో భక్తులు ఫొటోలు దిగారు. క్యూ కాంప్లెక్స్ క్యూలైన్‌లోని భక్తులకు వాతావరణ మార్పులతో ఉక్కపోతతో ఇబ్బంది పడ్డారు. భక్తులను కొండపైకి తరలించేందుకు అధికారులు తగినన్ని బస్సులను ఏర్పాటు చేశారు. 10వేల మంది భక్తులు నృసింహుడిని దర్శించుకోగా, వివిధ విభాగాల ద్వారా 13,76,057 ఆదాయం సమకూరింది.

వైభవంగా నిత్య కల్యాణం

సుప్రభాత సేవతో స్వామి అమ్మవార్లను మేల్కొపిన అర్చకులు నిత్యపూజలు సంప్రదాయరీతిలో నిర్వహించారు. గర్భాలయంలో స్వయంభువులకు అభిషేకం, అర్చనలు, ప్రాకార మండపంలో హోమం, నిత్య కల్యాణోత్సవ పర్వాలు వైభవంగా చేపట్టారు. పాతగుట్టలోనూ స్వామిఅమ్మవారలకు నిత్య పూజలు ఘనంగా చేపట్టారు. శివాలయంలో పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వర స్వామివారికి నిత్య పూజలు, రుద్రహవన పూజలు, శైవాగమరీతిలో జరిపారు. రాత్రి మహానివేదన, శయనోత్సవాలతో ఆలయ ద్వారబంధనం చేశారు.

మట్టపల్లిలో కొనసాగుతున్న పవిత్రత్సోవాలు



స్వామివారికి జలాభిషేకం, నిర్వహిస్తున్న యాజ్ఞీకులు

మఠంపల్లి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి):మట్టపల్లి లక్ష్మీనృసింహుని క్షేత్రంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు మూడో రోజు ఆదివారం కూడా కొనసాగాయి. ఉత్సవాల్లో భాగంగా క్షేత్రంలో పంచశయ్యాదివాసాల అనంతరం పవిత్రాలను స్వీకరించి సముహూర్త సమయంలో ప్రాకారాది గోపురాలకు ఆరోహణ చేశారు. ఉత్సవమూర్తులకు అష్టోత్తర శతకలశ స్నపన పంచామృతాలతో సర్వనది సముద్ర జలాలతో తిరుమంజనం నిర్వహించారు. రాత్రి 7 గంటలకు స్వామివారి ఉత్సవం అనంతరం మహాశాంతిహోమం తదితర కార్యక్రమాలను యాజ్ఞీకులు బొర్రా వాసుదేవశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. మహాక్షేత్రంలో ఏడాది కాలంలో అర్చకులు, ఉద్యోగులు, సిబ్బంది చేసినదోషాలు అపచారాలను శుద్ధి చేసేందుకు ప్రతి సంవత్సరం పవిత్రత్సోవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్తలు చెన్నూరి మట్టపల్లిరావు విజయ్‌కుమార్, ఈవో సిరికొండ నవీన్ తెలిపారు. కార్యక్రమాల్లో అర్చకులు తుమా శ్రీనివాసాచార్యులు, కృష్ణమాచార్యులు, పద్మనాభాచార్యులు, రామాచార్యులు, లక్ష్మణచార్యులు, బ్రహ్మాచార్యులు, ఫణి భూషణమంగాచార్యులు తదితరులు పాల్గొన్నారు

ఒకేతండాలో ముగ్గురికి మెడిసిన్ సీటు







రమావత్ లచ్చిరాం, రమావత్ సాయి, రమావత్ నందు

తిరుమలగిరి(సాగర్) : మారు మూలతండాకు చెందిన ముగ్గురు పేద విద్యార్థులు ప్రభుత్వ వైద్య కళాశాలల్లో మెడిసిన్‌లో సీటు సాధించారు. నల్లగొండ జిల్లా తిరుమలగిరి (సాగర్) మండలం ఎర్రచెర్వుతండాకు చెందిన రమావత్ నందు రమావత్ లచ్చిరాం, రమావత్ సాయిలు ఈ ఘనత సాధించారు. రమావత్ లచ్చిరాం, రమావత్ సా యి తండ్రులిద్దరూ చిన్నతనంలోనే మృతి చెం దారు. అయితే వారి తల్లుల సహకారంతో చిన్నతనం నుంచే పట్టుదలతో చదివి ఎంబీబీఎస్‌లో సీటు సాధించారు. రమావత్ లచ్చిరాం తల్లి తండాలోనే కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తుంది. లచ్చిరాం 1-5 తరగతి వరకు తండాలోని ప్రభుత్వ పాఠశాలలో, 6-10వ తరగతి వరకు తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ పెద్దవూరలో చదివాడు. అనంతరం ఖమ్మంలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ కళాశాలలో ఇంటర్మీడియట్‌ను పూర్తి చేశాడు. అనంతరం కోచింగ్ తీసుకుని నీట్‌లో మంచి ర్యాంకు సాధించి సీటు దక్కించుకున్నాడు. రమావత్ సాయి తల్లి శారదా కూలీనాలి పనులు చేసుకుంటూ కుటు ంబాన్ని పోషిస్తూ అతన్ని చదివించింది. 1-10వ తరగతి వరకు పెద్దవూర ప్రభుత్వ పాఠశాలలో అనంతరం ఇంటర్మీడియట్‌ను రాజేంద్రనగర్ ఐఐటీ మెడికల్ స్టడీ సర్కిల్‌లో కోచింగ్ తీసుకోని ఎంబీబీఎస్ సీటు సాధించాడు. రమావత్ నందు కూడా తండాలో 1-5 వ తరగతులను ప్రభుత్వ పాఠశాలలో చదివి అనంతరం దేవరకొండ గురుకుల పాఠశాల, కళాశాలలో సీటు సాధించి అక్కడే 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదివింది. అనంతరం హైదరాబాద్‌లో కోచింగ్ తీసుకోని రెండో ప్రయత్నంలో ఎంబీబీఎస్ సీటు సాధించింది. కాగా, రమావత్ నందుకు మేడ్చల్ సీఎంఆర్ మెడికల్ కళాశాల, రమావత్ సాయికి మహబూబ్‌నగర్ ప్రభుత్వ మెడికల్ కళాశాల, రమావత్ లచ్చిరాం రామగుండం మెడికల్ కళాశాలల్లో సీటు పొందారు.ఒకే ఏడాది తండా నుంచి ముగ్గురు విద్యార్థులు చదువులో ప్రతిభ చాటడం పట్ల కుటుంబీకులు, పలువురు హర్షం వ్యక్తం చేశారు.

గుండుసూది మొనపై బతుకమ్మ



సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణానికి చెందిన సూక్ష్మకళాకారుడు తమలపాకుల సైదులు బతుకమ్మ వేడుకలను పురస్కరించుకుని తమ సూక్ష్మకళ నైపుణ్యంతో గుండు సూది మొనపై నాలుగు మిల్లీ మీటర్ల బతుకమ్మను తయారు చేశాడు గతంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పెన్సిల్ మొన, అవగింజ, బియ్యపు గింజ, అగ్గిపుల్లపై, సూది రంధ్రంలో పట్టే జాతీయ జెండాను తయారు చేసి, తన ప్రతిభను చాటుకున్నారు.



తమలపాకుల సైదులు

(ఆంధ్రజ్యోతి- కోదాడ)

శరవేగంగా స్టీల్ బ్రిడ్జి నిర్మాణం



బ్రిడ్జి నమూనా

యాదగిరిగుట్ట, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట దేవస్థానం అభివృద్ధిలో భాగంగా నెట్‌వర్క్ ఆర్చ్ బ్రిడ్జి (స్టీల్ బ్రిడ్జీ) పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ బ్రిడ్జి బీంలను బిగించేందుకు అధికారులు కింద బేస్ పనుల బిగింపు ప్రక్రియ పనుల్లో నిమగ్నమయ్యారు. ఇటీవల ప్రారంభమైన బ్రిడ్జి నిర్మాణ పనులు ఊపందుకోగా గతంలో పట్టణంలోని వాసవీ కన్యాక పరమేశ్వరీ సత్రం నుంచి రూ.32 కోట్లతో మొదటి ఘాట్ రోడ్డు మొదటి మలుపు వరకు బ్రిడ్జి పనులు పూర్తి అయ్యాయి. కాగా కొండచుట్టూ నాలుగు లైన్లుగా విస్తరించిన రోడ్డు భాగంలో (విస్తీర్ణంలో) మాత్రమే రూ.4.2కోట్లతో స్టీల్ బ్రిడ్జి నిర్మిస్తున్నారు. ఈ పనులు 13.2మీటర్ల వెడల్పుతో 490 మీటర్ల పొడవుతో నిర్మించేందుకు గత ప్రభుత్వం సంకల్పించింది. కాగా, రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం బెకెం సంస్థ నిర్వహిస్తున్న 64మీటర్ల పొడవులో నిధుల కొరతతో నిలిచిపోయిన స్టీల్ బ్రిడ్జి పనులను తిరిగి ప్రారంభించింది. ఈ పనులు పూర్తయితే స్వామివారి భక్తులకు రవాణా సౌకర్యం సులభతరం కానుంది.

ఆత్మకూర్ (ఎస్)లో ఇద్దరు విద్యార్థులకు..





కడపర్తి సిద్దార్థ యతాకుల శ్రీజ

ఆత్మకూర్(ఎస్) :సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండల కేంద్రానికి చెందిన మండల కేంద్రానికి చెందిన కడపర్తి ప్రభాకర్ స్వప్న కుమారుడు సిద్ధార్థ నీట్ పరీక్ష ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 336వ ర్యాంకు సాధించాడు. రాష్ట్ర మెడికల్ బోర్డు ప్రకటించిన ఫలితాల్లో ఆల్ ఇండియా 23,820 వ ర్యాంకు సాధించారు. హైదరాబాద్‌లో 7వ తరగతి నుంచి ఇంటర్మీడియేట్ వరకు చదివాడు. సిద్ధార్థ తండ్రి ప్రభాకర్ బోడుప్పల్‌లో ప్రైవేట్ టీచర్‌గా పని చేస్తున్నాడు. తల్లి స్వప్న బోడుప్పల్ గురుకుల పాఠశాలలో ప్రభుత్వ టీచర్‌గా పనిచేస్తున్నారు.

● మండల కేంద్రానికి చెందిన యాతకుల వెంకన్న, తల్లి వెంకటమ్మ కుమార్తె శ్రీజ నీట్‌లో 407 మార్కులు సాధించి ఆల్ ఇండియాలో 19,593 వ ర్యాంకు సాధించింది. హైదరాబాద్‌లోని ఎల్‌బీ నగర్ ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి వరకు చదివిన శ్రీజ ఉత్తమ ఫలితాలు సాధించడంతో స్వచ్ఛంద సేవ సంస్థ దిల్‌సుఖ్ నగర్‌ల ప్రైవేట్ కళాశాలలో చేర్పించి చదివించారు. శ్రీజ తల్లిదండ్రులు వ్యవసాయ కార్మికులు.

పెన్‌పహాడ్ విద్యార్థినికి



థెరిసాకు స్వీటుకు తినిపిస్తున్న తల్లిదండ్రులు

పెన్‌పహాడ్: మండలకేంద్రానికి చెందిన విద్యార్థిని థెరిసా ఆల్ ఇండియా నీట్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభను చూపింది. పెన్‌పహాడ్ మండల కేంద్రానికి పల్లెపంగి విజయ్ వెంకటరమణల కుమార్తె థెరిస్సా పదో తరగతి వరకు జాజిరెడ్డిగూడెం గురుకుల పాఠశాలలో చదువుకుంది. ఇంటర్మీయట్ సూర్యాపేటలో ఒక ప్రైవేట్ కళాశాలలో పూర్తి చేసింది. కాగా థెరిసా తండ్రి విజయ్ గ్రామంలో వ్యవసాయం చేస్తుండగా, తల్లి వెంకటరమణ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆశా వర్కర్‌గా పనిచేస్తోంది

ఇందిరమ్మ త్యాగఫలమే ఎస్టీ రిజర్వేషన్లు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్, కోదండరెడ్డి, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, రవీంద్రనాయక్

దేవరకొండ, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని ఇందిరాగాంధీ త్యాగఫలమే ఎస్టీ రిజర్వేషన్లని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. హైదరాబాద్‌లో ఆదివారం ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి మాట్లాడారు. ఎస్టీ రిజర్వేషన్లు అమలై 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా హైదరాబాద్‌లో మాజీ మంత్రి రవీంద్ర నాయక్, రాంచందర్‌నాయక్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరామిరెడ్డితో కలిసి ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. ప్రధానిగా ఇందిరాగాంధీ గిరిజనులకు రిజర్వేషన్లు అమలు చేసిందన్నారు. సమావేశంలో ఆలిండియా బంజారా సంఘం నేతలు రవీంద్రనాయక్, బలరాంనాయక్, గిరిజన సంఘాల నేతలు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

'టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి'

నల్లగొండ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులందరూ టెట్ పరీక్ష పాస్ కావాలనే నిబంధన నుంచి మినహాయింపులు ఇవ్వాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.వెంకటేశం కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. 2010 తరువాత నియామకం అయినా ఉపాధ్యాయులకు మాత్రమే టెట్ వర్తింప జేయాలని సుప్రీంకోర్టు తీర్పుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రివ్యూ పిటీషన్ దాఖలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వెంకులు, ఏడుకొండల్, పుష్ప, నాగయ్య, వెంకటేశ్వర్లు, రాయల్ కుమారి, అంజయ్య, ఖుర్షీద్‌మియా తదితరులు పాల్గొన్నారు.

యూరియాపై బీజేపీ నేతలు మాట్లాడటం సిగ్గుచేటు

● కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి

మిర్యాలగూడ, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): యూరియా పంపిణీలో అక్రమాలు జరిగాయంటూ బీజేపీ నేతలు మాట్లాడటం సిగ్గు చేటని, అసలు కేంద్రం ఇచ్చిదెంత, అక్రమాలు జరిగిందెక్కడ తెలుసుకుని మాట్లాడాలని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం కాంగ్రెస్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి మిర్యాలగూడ సమావేశంలో కాంగ్రెస్ నాయకులను విమర్శించడంపై మండిపడ్డారు. కమలం నాయకులు సేవే లక్ష్యంగా పనిచేస్తున్న కాంగ్రెస్ నాయకులను విమర్శించడం హాస్యాస్పదమన్నారు. కేంద్రాన్ని ఒప్పించి యూరియాను తెప్పించాల్సిన నాయకులు ఆ పనిచేయకుండా జానారెడ్డి, ఎమ్మెల్యే బీఎల్ఆర్, ఎంపీ రఘువీర్‌రెడ్డిలు యూరియా వ్యాగన్‌ను సాగర్‌కు తరలించుకుపోయారని వర్షిత్‌రెడ్డి మాట్లాడటం అవివేకమన్నారు. వైద్యం పేరుతో డబ్బులు దండుకున్న వర్షిత్‌రెడ్డికి బీఎల్ఆర్‌ను విమర్శించే అర్హత లేదన్నారు. కాంగ్రెస్ మండల నాయకుడు నరేందర్‌గౌడ్ మాట్లాడుతూ మిర్యాలగూడ నియోజకవర్గ రైతులకు 2 లక్షల 90 వేల యూరియా బస్తాలు కావాల్సివుండగా 1 లక్షా 40 వేల బస్తాల యూరియా మాత్రమే సరఫరా అయ్యాయనే విషయం బీజేపీ నేతలకు తెలియదని అన్నారు. ఎంపిటీసీల ఫోరం జిల్లా ఉపాధ్యక్షుడు బెజ్జం సాయి మాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్ కారణంగా రా మెటీరియల్ సరఫరా కాక యూరియా కొరత ఏర్పడిందని బీజేపీ నేత రఘునందన్‌రావు ప్రకటించిన సోయికూడా మరచి ఎమ్మెల్యే గన్‌మెన్ ఫ్రాడ్ చేయడం వల్ల వందల కోట్లు అవినీతి జరిగిందని వర్షిత్‌రెడ్డి మాట్లాడటం అవివేకమన్నారు. సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు చిరుమర్రి కృష్ణయ్య, పగిడి రామలింగయ్య, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి చిలుకూరి బాలు, దేశిడి శేఖర్‌రెడ్డి, గోదాల జానకిరాంరెడ్డి, హజారొద్దీన్ పాల్గొన్నారు.

జాతీయ రహదారులపై వాహనాల రద్దీ



పంతంగి టోల్‌ప్లాజా వద్ద బారులు తీరిన వాహనాలు

చౌటుప్పల్‌రూరల్, కేతేపల్లి, బీబీనగర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని జాతీయ రహదారులపై ఆదివారం వాహనాల రద్దీ కొనసాగింది. విజయదశమి పర్వదినం పురస్కరించుకుని సెలవుల నేపథ్యంలో రాజధానిలో ఉంటున్న ప్రజలు హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదరి, హైదరాబాద్-వరంగల్ వైపు సొంత వాహనాల్లో స్వగ్రామాలకు వెళ్లారు. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం గూడూరు టోల్ ప్లాజా వద్ద 12గేట్లు ఉండగా 20వేల వాహనాలు రాకపోకలు కొనసాగించాయి. చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద 16గేట్లు కాగా విజయవాడ వైపు తొమ్మిది, హైదరాబాద్ వైపు ఏడు గేట్ల నుంచి వాహనాలు వెళ్లాయి. సాధారణ రోజుల్లో 30వేల వాహనాలు వెళ్లగా, ఆదివారం ఎనిమిది వేల వాహనాలు అదనంగా రాకపోకలు కొనసాగించాయి. నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద సాధారణ రోజుల్లో 11వేల వాహనాలు ప్రయాణించగా, ఆదివారం రెండు వేల వాహనాలు అదనంగా రాకపోకలు కొనసాగించాయి.


మెడికల్ విద్యార్థినికి సన్మానం



ఇందును సన్మానిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

చిట్యాలరూరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడుకు చెందిన మంకాల ఇందు నల్లగొండ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు సాధించింది. దీంతో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆదివారం గ్రామంలో ఆమెను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్, నరేష్, మంకాల కృష్ణ, ఆడెపు రమేష్, కూనూరు గణేష్, గోలి సాయికిరణ్, కూరాకుల బాలు, దండు వివేక్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన సత్రాల సమాఖ్య కన్వీనర్‌గా సూర్యనారాయణ



సూర్యనారాయణను సన్మానిస్తున్న కాశీనాథ్

చౌటుప్పల్ టౌన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత పద్మశాలీ నిత్యాన్నదాన సత్రాల సమాఖ్య కన్వీనర్‌గా వర్కాల సూర్యనారాయణ ఎన్నికయ్యారు. సత్రాల సమాఖ్య మార్గదర్శకుడు చిలువేరు కాశీనాథ్ పర్యవేక్షణలో దేశంలోని ఏడు పద్మశాలీ నిత్యాన్నదాన సత్రాలకు చెందిన ప్రతినిధులతో హైదరాబాద్‌లో ఆదివారం ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం గ్రామానికి చెందిన వర్కాల సూర్యనారాయణను దేశంలోని ఏడు పద్మశాలి నిత్యాన్నదాన సత్రాల సమాఖ్య కన్వీనర్‌గా ఎన్నుకున్నారు. శ్రీశైలంలోని పద్మశాలీ అన్న సత్రం కోశాధికారి, వర్కింగ్ ప్రెసిడెంట్, ప్రెసిడెంట్‌గా సూర్యనారాయణ 25 ఏళ్లుగా సేవలను అందించారు. శ్రీశైలంలోని అన్నదాన సత్రానికి అందించిన సేవలను పద్మశాలీ ప్రముఖులు గుర్తించి ఏడు నిత్యాన్నదాన సత్రాల సమాఖ్య కన్వీనర్‌గా సూర్యనారాయణను ఎన్నుకున్నారు. ప్రస్తుతం చిలువేరు కాశీనాథ్ పర్యవేక్షణలో ఏడు నిత్యాన్నదాన సత్రాలు నడుస్తున్నాయి.



ఎల్లమ్మ ఆలయంలో నేటి నుంచి దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు

కనగల్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): దర్వేశిపురం స్టేజీ వద్ద గల శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయకమిటీ చైర్మన్‌చీదేటి వెంకట్‌రెడ్డి, ఈవో అంబటి నాగిరెడ్డి, ఆలయ ముఖ్యఅర్చకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు అమ్మవారు రోజుకో అవతారంలో దర్శనమిస్తారని తెలిపారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం

కనగల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చర్లగౌరారం గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కోరె రాధాకృష్ణ కుటుంబసభ్యులను అతని స్నేహితులు ఆదివారం వారి ఇంటి వద్ద కలిసి పరామర్శించారు. రూ.25వేల ఆర్థికసాయం అందజేశారు. అంతకుముందు రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కదిరె శ్రీశైలం, బిళ్లపాటి మోహన్‌రెడ్డి, వెంకటేశం, అజయ్, విజయ్, చంద్రమౌళి, సురేష్, నర్సింహ, ఉమారాణి పాల్గొన్నారు.

అడుగడుగునా గుంతలు - ప్రయాణికుల అవస్థలు

- శాలిగౌరారం, బాలిశెట్టిగూడెంలో రోడ్డు దుస్థితి
- డబుల్ రోడ్డుగా నిర్మించాలని ప్రజల విజ్ఞప్తి



శాలిగౌరారంలో ఆస్పత్రి వద్ద గుంతలతో అధ్వానంగా ఉన్న పీఆర్ రోడ్డు

శాలిగౌరారం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు రోడ్లు అడుగడుగునా గుంతలతో అధ్వానంగా తయారయ్యాయి. దీంతో ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధుల అలసత్వం వెరసి ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ గుంతల రోడ్లు ఏ మారుమూల గ్రామంలో అనుకుంటే పొరపాటే... శాలిగౌరారం మండలకేంద్రంలో నిత్యం అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రయాణిస్తున్న రహదారుల పరిస్థితే ఇలా ఉంటే గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే పరిస్థితి ఎవరూ పట్టించుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. శాలిగౌరారం బస్ స్టేజీ నుంచి ఆస్పత్రి, గ్రామపంచాయతీ, సింగల్‌విండో బ్యాంకు నుంచి దొనబండ ఎక్స్ రోడ్డు వరకు, అక్కడి నుంచి బాలిశెట్టిగూడెం, పోలీస్‌స్టేషన్ వరకు ఉన్న పంచాయతీరాజ్ విభాగం రోడ్డు అడుగడుగునా గుంతలతో దర్శనమిస్తోంది. ఈ మార్గంలో వెళ్లే బస్సులు, లారీలు గుంతలు బాగా ఉండటం వల్ల ఉయ్యాలా జంపాలా అన్న మాదిరిగా నడుస్తున్నాయి. పోలీస్‌స్టేషన్, బాలిశెట్టిగూడెం స్కూల్ వద్ద కూడా రోడ్డు పెద్ద పెద్ద అగాధాలు ఏర్పడి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. ద్విచక్ర వాహనాలు, బాటసారులు కూడా ఈ రోడ్డుపై వెళ్లలేని పరిస్థితి నెలకొంది. వర్షం పడినపుడు గుంతల్లో నీరు చేరి ప్రమాద భరితంగా ఉంటున్నాయి. భారీ వాహనాలు దిగబడి పోతున్నాయి. ఎన్నో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. శాలిగౌరారం బస్‌స్టేజీ నుంచి దొనబండ వరకు ఉన్న రెండు కిలోమీటర్ల రోడ్డును తారు రోడ్డుగా 20 సంవత్సరాల క్రితం నిర్మించారు. అప్పటి నుంచి నేటి వరకు ఎలాంటి మరమ్మతులు నోచుకోలేక రోడ్డు స్వరూపమే మారిపోయింది. బస్‌స్టేజీ నుంచి ఆస్పత్రి వరకు కంకరతేలి బాటసారులు నడవకుండా ఉంది. నిత్యం ఎంతో రద్దీగా ఉండే ఈ రోడ్డును ఎప్పుడో డబుల్ రోడ్డుగా మార్చాల్సి ఉన్నా అధికారులు, ప్రజాప్రతినిధులు మాత్రం పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలో ప్రధాన రోడ్డులో స్కూల్ విద్యార్థులు, హాస్పిటల్‌కు వచ్చే రోగులు, సింగల్‌విండో బ్యాంక్‌కు వెళ్లే రైతులు, వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి వచ్చే ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారు. అయినా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. వెంటనే సంబంధిత అధికారులు ఈ రోడ్డును పరిశీలించి సీసీతో డబుల్ రోడ్డుగా నిర్మించాలని వివిధ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సీసీతో డబుల్ రోడ్డుగా నిర్మించాలి



శాలిగౌరారం మండలకేంద్రంలోని రోడ్డు అడుగడుగునా గుంతలతో అస్తవ్యస్తంగా మారింది. ఈ ప్రధాన రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. భారీ వాహనాలు, బస్సులు, ద్విచక్రవాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఈ రోడ్డు పై వెళ్లాలంటే భయంగా ఉంది. పెద్దపెద్ద గుంతలు ఉండటం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. వెంటనే అధికారులు స్పందించి డబుల్ రోడ్డుగా నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలి.

\- గూడపూరి భాస్కర్,శాలిగౌరారం

ఆదమరిస్తే అంతే

ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు



పెట్రోల్ బంక్ వద్ద ప్రమాదకరంగా ఉన్న కల్వర్ట్

మర్రిగూడ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మర్రిగూడ చౌరస్తా నుంచి మాల్‌కు వెళ్లే రహదారి ప్రక్కన కల్వర్టు ప్రమాదకరంగా మారడంతో ప్రజలు, వాహనదారులు భయభ్రాంతులకు గురవుతున్నారు. చౌరస్తా సమీపంలోని భారతి పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న రహదారి పక్కనే కల్వర్టు ప్రమాదకరంగా ఉండటంతో రాత్రి వేళలో వాహనాలపై వెళ్లే వారికి ఏ క్షణాన ఏమి జరుగుతుందోనని భయపడుతున్నారు. ఆదమరిస్తే అంతేనని ప్రయాణికులు వాపోతున్నారు. రహదారికి సమీపంలో ఉన్న కాల్వ మరమ్మతుకు నోచుకోకపోవడంతో ప్రమాదకరంగా మారింది. ఈ ప్రమాదకరమైన కల్వర్టులో పడి గతంలో పలువురు వాహనదారులు ప్రమాదానికిలోనై తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ రహదారిపై రోజుకు వందలాది మంది బాటసారులు, వాహనదారులు ద్విచక్రవాహనాలపై మాల్ ప్రాంతానికి అదేవిధంగా పోలీస్ స్టేషన్, తహసీల్దార్, బీఎస్ఎన్ఎల్, కార్యాలయం, విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రభుత్వ వసతిగృహాలు పాఠశాలలకు నిత్యం వెళ్తుంటారు. పలుమార్లు ప్రజలు ప్రమాదాలకు గురైనా అధికారులు ఈ కల్వర్టు వద్ద ప్రమాద సూచిక హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయకపోవడం బాధాకరమని పలువురు వాపోతున్నారు. ప్రమాదకరంగా ఉన్న ఈ కల్వర్టు మరమ్మతులకు నోచుకోలేక అస్తవ్యస్తంగా తయారైంది. రహదారి ప్రక్కనే ఉన్న కల్వర్టుకు రక్షణవలయాన్ని ఏర్పాటు చేయడమే కాకుండా ప్రమాద సూచిక హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసి కల్వర్టుకు మరమ్మతులు చేపట్టి పొంచి ఉన్న ప్రమాదాల నుంచి కాపాడాలని పలువురు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో ఎంగిలిపువ్వు బతుకమ్మ వేడుకలు



నల్లగొండ రామాలయంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



నల్లగొండ రాక్‌హిల్స్ కాలనీలో బతుకమ్మలతో చిన్నారులు





నల్లగొండ పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో...





క్యాంపు కార్యాలయంలో బతుకమ్మ వేడుకల్లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి



శాస్త్ర స్కూల్‌లో బతుకమ్మ సంబరాలు



నకిరేకల్‌లో బతుకమ్మ తీసుకెళ్తున్న ఎమ్మెల్యే వీరేశం దంపతులు



నల్లగొండ : గాంధీనగర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



కట్టంగూరులో బతుకమ్మలతో బాలికలు

- పోటీ పడి బతుకమ్మలను పేర్చి తీసుకొచ్చిన మహిళలు
- వర్షంతో ఎంగిలిపువ్వు బతుకమ్మ వేడుకలకు ఆటంకం

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్): చిత్తు చిత్తుల బొమ్మ శివుడి ముద్దుల గుమ్మ... మా వాడకొచ్చెనమ్మో బంగారు బొమ్మ.. ఇద్దరొ క్క చెల్లెళ్ల ఉయ్యాలో.. ఒక్కారికిచ్చెను ఉయ్యాలో.. ఒక్కొక్క పువ్వేసి చందమామ.. ఒక్క జాములాయె చందమామ.. బతుకమ్మ బతుకమ్మ బంగారు బతుకమ్మ వంటి పాటలతో మహిళలు బతుకమ్మ వేడుకలను కన్నుల పండువగా నిర్వహించారు. ఎంగిలిపువ్వు బతుకమ్మ ఉత్సవాలను ఆదివారం రాత్రి అంబరాన్ని తాకాయి. చిన్నా పెద్దా అనే తేడా లేకుండా మన సంస్కృతిని ప్రతిబింబించే విధంగా మహిళలు, యువతులు బతుకమ్మలను తీరుతీరు పూలతో ఆకర్షణీయంగా, అందంగా పేర్చి తీసుకువచ్చారు. అందరూ కలిసి ఒక్కచోట బతుకమ్మలను వరుస క్రమంలో ఉంచి ఆటపాటలతో వాటి చుట్టూ లయబద్ధంగా తిరుగుతూ ఉత్సవాలు జరిపారు. వర్షం కురియడంతో బతుకమ్మ వేడుకలకు ఆటంకం కలిగింది. బతుకమ్మలు తీసే సమయంలో మబ్బులతో భారీ వర్షం కురిసింది. దీంతో చాలా ప్రాంతాల్లో బతుకమ్మ ఉత్సవాలు ఆలస్యంగా మొదలయ్యాయి. బతుకమ్మ పాటలతో మహిళలు పరవశించి పోయారు. అనంతరం బతుకమ్మలను ప్రత్యేక వాహనంలో తీసుకువెళ్లి సమీపంలోని బతుకమ్మ కుంటలో, కాలువలో నిమజ్జనం చేశారు. నల్లగొండ పట్టణంలోని తులసీనగర్ శ్రీభక్తాంజనేయస్వామి దేవాలయం, షేర్ బంగ్లా సంతోషిమాత దేవాలయంతో పాటు ప్రధాన కూడళ్లల్లో బతుకమ్మ ఆడారు. వీటీ కాలనీలోని శ్రీదేవి భూదేవి సహిత వేంకటేశ్వరస్వామి ఆలయంలో కళాత్మకంగా ప్రకృతి పూలతో పెద్ద సైజులో పేర్చి తీసుకొచ్చిన బతుకమ్మలను సంస్కృతి ప్రతిబింబించే వాటికి బహుమతులు అందజేశారు.

జిల్లాలో వైభవంగా వేడుకలు

జిల్లాలోని వివిధ మండలాల్లో ఆదివారం ఎంగిలిపువ్వు బతుకమ్మ వేడుకలను భక్తిశ్రద్ధలు, సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. వివిధ రకాల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలను మహిళలు ఎత్తుకుని ఆయా గ్రామాల్లోని దేవాలయాలు, గ్రామ శివారులోని చెరువులు, కుంటల వద్దకు చేరుకున్నారు. ఒక్కచోట పెట్టిన బతుకమ్మల చుట్టూ తిరుగుతూ ఆడిపాడారు. అనంతరం స్థానికంగా ఉన్న చెరువులు, కుంటల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. ఆయా గ్రామాల్లో బతుకమ్మ వేడుకల నిర్వహణకు చెరువుల వద్ద గ్రామ పంచాయతీలు, ఆలయ కమిటీలు ఏర్పాట్లు చేశాయి. పలు పాఠశాలల్లో కూడా బతుకమ్మ ఉత్సవాలను నిర్వహించారు. నకిరేకల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వేముల వీరేశం దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవాలను ప్రారంభించారు.

ఎస్‌పీజీ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడిగా ఆర్‌వీజీ



వేణుగోపాల్‌రెడ్డి

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): సోలార్ పవర్ జనరేటర్స్ (ఎస్‌పీజీ) జిల్లా అసోసియేషన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నార్కట్‌పల్లి మండలంలోని ఎల్లారెడ్డిగూడెంలో ఆదివారం నిర్వహించిన అసోసియేషన్ జిల్లా సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఎస్‌పీజీ అధ్యక్షుడిగా నార్కట్‌పల్లి మండలంలోని ఎనుగులదోరి గ్రామానికి చెందిన రేగట్టె వెంకట్‌గోపాల్ రెడ్డి, కార్యదర్శిగా కోమటిరెడ్డి పృథ్వీధర్‌రెడ్డిని ఎన్నుకున్నారు. అదేవిధంగా వీరిద్దరూ ఎస్‌పీజీ రాష్ట్ర కమిటీ స్థాయికి ప్రతినిధులుగా వ్యవహరించేలా సభ్యులు నిర్ణయించారు. ఈ సందర్భంగా రేగట్టె వెంకట్‌గోపాల్‌రెడ్డి, కోమటిరెడ్డి పృథ్వీరెడ్డి మాట్లాడుతూ ఎస్పీజీలు ఎదుర్కొంటున్న విద్యుత్ లైన్ల సమస్యను ట్రాన్స్‌కో ఎస్ఈ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

రెండు రోజులుగా వీడని ముసురు



కేతేపల్లిలో కురుస్తున్న వర్షం

కేతేపల్లి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం ముసురు వర్షం కురిసింది. శనివారం రాత్రి సైతం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఆదివారం రోజంతా తీవ్రమైన ఎండవేడి, ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం కురిసిన వర్షంతో వాతావరణం చల్లబడి ప్రజలు సేదతీరారు. శని, ఆదివారాల్లో కురిసిన వర్షానికి మండలంలోని వివిధ గ్రామాల్లో వాగులు, వంకలు వరద నీటితో ప్రవహిస్తున్నాయి. దీంతో క్రమంగా చెరువులు, కుంటల్లోకి నీరు చేరుతోంది. వర్షంధాటికి మండల కేంద్రం కేతేపల్లిలో జాతీయ రహదారికి ఇరువైపులా గల సర్వీసు రోడ్లపై నీరు నిలిచింది. మండలంలోని ఇనుపాముల గ్రామంలో జాతీయ రహదారిపై నిర్మించిన అండర్ పాసింగ్ వంతెన కింద వర్షపు నీరు నిలవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడింది. ఈ క్రమంలో కేతేపల్లి వైపు నుంచి నకిరేకల్ పట్టణానికి వెళ్లే వారు హైవే మీదుగా ప్రయాణించి నకిరేకల్ శివారులోని తిప్పర్తి రోడ్డు మీదుగా వెళ్లాల్సి వచ్చింది.

అమావాస్య సందర్భంగా అన్నదానం

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): పితృ అమావాస్య తిథిని పురస్కరించుకుని మండలంలోని దేవాలయాలు, సత్రాలు, పీఠాల్లో, స్వచ్ఛంద సంస్థలు అన్నదాన ప్రసాద వితరణ గావించారు. నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆలయం, మనం స్వచ్ఛంద సంస్థ, ఎల్లారెడ్డిగూడెంలోని వాసవీ అన్నపూర్ణ సత్రం, చెర్వుగట్టులోని సోమేశ్వర శివజ్ఞానపీఠంలో ఆదివారం అమావాస్య సందర్భంగా భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో అన్నప్రసాద దాతలు కుర్మిళ్ల కళావతి కుటుంబసభ్యులు, రామోజు నాగచారి నిహారిక దంపతులు, పోతులపాటి అరుణారామలింగేశ్వరశర్మ, రంగాశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

నల్లగొండరూరల్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జీపీ కార్మికులకు వేతనాలు రాకపోతే పండుగ పూట ఉండాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు నెలలుగా వేతనాలు రాకపోవడంతో అప్పులు చేసి కటుంబాలను ఈడ్చుకొస్తున్నారని, ఇప్పటికైనా వేతనాలు ఇవ్వకపోతే రానున్న పండుగను ఎలా జరుపుకుంటారని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేయకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

సేవా కార్యక్రమాలు చేపట్టాలి

కట్టంగూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఆఫ్ కట్టంగూరు ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఎమ్మెల్యే వీరేశం సూచించారు. ఇటీవల నూతనంగా ఏర్పడిన లయన్స్ క్లబ్ ఆఫ్ కట్టంగూరు కింగ్స్ ఎమ్మెల్యే వీరేశంను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను వీరేశం అభినందించగా వారు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు చిక్కు శేఖర్, ప్రధానకార్యదర్శి గుడిపాటి శివప్రసాద్, కోశాధికారి పోగుల రాములు, ఉపాధ్యక్షుడు రెడ్డిపల్లి సాగర్, కల్లూరి వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి బసవోజు వినోద్, సభ్యులు తవిడబోయిన నర్సయ్య, చెరుకు శ్రీనివాస్, బొడ్డుపల్లి వెంకన్న, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, ఉపేందర్, యాదయ్య, హరీష్ పాల్గొన్నారు.

అమ్మవారికి చీర సారె సమర్పణ



అమ్మవారికి చీరసారె సమర్పిస్తున్న పద్మశాలీసంఘం నాయకులు

చిట్యాల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): చిట్యాల పట్టణంలోని కనకదుర్గ ఆలయంలో సోమవారం నుంచి దేవి శరన్నవరాత్రోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా అమ్మవారికి ఆదివారం చిట్యాల భక్తమార్కండేయ పద్మశాలీసంఘం ఆధ్వర్యంలో చీర సారె సమర్పించారు. మేళతాళాలతో చీర సారెను పట్టణంలో ఊరేగించిన అనంతరం అమ్మవారికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మారగోని ఆంజనేయులుగౌడ్, పద్మశాలీసంఘం అధ్యక్షుడు జెల్లా మనోహర్, ప్రధాన కార్యదర్శి గంజి వెంకటేశం, శ్రీనివాస్, గోవర్ధన్, సత్తయ్య పాల్గొన్నారు.

తెలంగాణ కోసం పోరాడిన ఉద్యమనేత లక్ష్మణ్ బాపూజీ



కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సంఘం నాయకులు

- పద్మశాలీ జిల్లా సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ

నల్లగొండకల్చరల్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాటం చేసిన తొలి, మలి ఉద్యమనేత కొండా లక్ష్మణ్ బాపూజీ అని పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు పొట్టబత్తుల సత్యనారాయణ అన్నారు. ఆచార్య కొండా లక్ష్మణ్‌బాపూజీ 13 వర్ధంతి సందర్భంగా పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని హైదరాబాద్‌రోడ్డులోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాపూజీ త్యాగం నీతి నిజాయతీ, నిబద్ధతకు నిదర్శనమన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి నిరంతరం శ్రమించారన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శులు కర్నాటి యాదగిరి, పున్న రవీందర్, కోశాధికారి రాపోలు సతీష్, నాయకులు మిరియాల వెంకటేశం, గంజి మురళి, సత్తయ్య, గంజి నాగరాజు, పున్నరమేష్, యోగానందం, శ్రీరంగం తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ టౌన్: ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మిర్యాల యాదగిరి, సంఘం జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ చేనేత పితామహుడు బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి కొండా లక్ష్మణ్ బా పూజీ అని కొనియాడారు. తెలంగాణ కోసం తొలి, మలిదశ ఉద్యమంలో ఊపిరి ఉన్నంత వరకు ఉద్యమించిన మహానేత అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు వంగూరు నారాయణయాదవ్, బీసీ సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడు పుట్ట వెంకన్నగౌడ్, కార్యదర్శి నాగరాజు గౌడ్, పద్మశాలీ సంఘం చేనేత సంఘం రాష్ట్ర కార్యదర్శి గంజి బిక్షమయ్య, జెల్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మణ్ బాపూజీకి నివాళులర్పిస్తున్న బీసీ సంఘం నాయకులు

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	587.60 (305.6242)	3,25,602	3,25,602
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.70 (4.12)	65950.62	5651.42
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	172.209 (41.5360)	2,20,342	2,12,618

చికెన్ ధరలు: లైవ్ : రూ.160 | డ్రెస్ : రూ.220 | స్కిన్‌లెస్ : రూ.255



జిల్లాకేంద్రంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

వైభవంగా ఎంగిలి పూల బతుకమ్మ

వర్షపు జల్లుల నడుమ ఎంగిలి పూల బతుకమ్మ వేడుకలను ఆదివారం సూర్యాపేటలో వైభవంగా జరుపుకున్నారు. తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలను పట్టణంలోని ప్రతీ వీధిలో ప్రతిష్ఠించి సంప్రదాయ పాటలు పాడుతూ మహిళలు ఉత్సాహంగా బతుకమ్మ ఆడారు. దీంతో బస్తీలన్నీ పూల వనాలను తలపించాయి. వివిధ రూపాల్లో బతుకమ్మలను అలంకరించారు. ఆలయాలు, సమీపంలోని వ్యవసాయ బావుల్లో నిమజ్జనం చేశారు. వాయినాలు ఇచ్చిపుచ్చుకొని ప్రసాదాలు పంపిణీ చేశారు. పలువురు ప్రముఖులు వేడుకల్లో పాల్గొని బతుకమ్మ ఆడారు. ఎంగిలి పూల బతుకమ్మ కోసం మునిసిపాలిటీ అన్ని బస్తీలలో వీధి లైట్లు, తదితర ఏర్పాట్లు చేసింది. పోలీసులు ప్రత్యేక పెట్రోలింగ్ నిర్వహించారు.

(ఆంధ్రజ్యోతి-నల్లగొండ కల్చరల్)



జిల్లాకేంద్రంలో బతుకమ్మతో వస్తున్న యువతి





ధాన్యం కొనుగోళ్లపై కసరత్తు

- బ్యాంక్ గ్యారంటీలకు ఆదేశాలు
- మిల్లర్ల సమావేశాలు నిర్వహించేందుకు సన్నాహాలు
- దసరా తర్వాత కొనుగోళ్లపై సమావేశాలు

వానాకాలం ధాన్యం కొనుగోళ్లకు ప్రభుత్వం సన్నద్ధమవుతుంటే, క్షేత్రస్థాయిలో పలు అవరోధాలు నెలకొన్నాయి. మిల్లర్ల నుంచి బ్యాంక్ గ్యారంటీలు తీసుకోవాలని, అండర్‌టేకింగ్ అనుమతించ వద్దని పౌర సరఫరాల శాఖ కమిషనర్ ఇప్పటికే ఉత్తర్వులు జారీచేశారు. అయితే ధాన్యం ఉత్పత్తి భారీగా జరిగే ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఈసారి క్షేత్రస్థాయిలో ధాన్యం సేకరణకు ఇబ్బందులను పరిష్కరించాల్సిన అనివార్య పరిస్థితి ప్రభుత్వంపై ఉంది.

– (ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)

ఉమ్మడి జిల్లాలో గోదాముల్లో ఖాళీ లేకపోవడంతో మిల్లులు ఇప్పటికే మిల్లింగ్ సామర్థ్యం తగ్గించాయి. గడచిన యాసంగికి సంబంధించిన సీఎంఆర్ బియ్యాన్ని సైతం నిల్వ చేయడానికి ఇబ్బందులు పడుతున్నారు. భారీగా ధాన్యం ఉత్పత్తి వస్తుందనే అంచనా నేపథ్యంలో నిల్వ ధాన్యాన్ని తరలించకపోతే, వానాకాలం కొనుగోళ్లపై ఆ ప్రభావం పడనుందని భావిస్తున్నారు.

బ్యాంకు గ్యారంటీలపై నిర్ణయం

పౌరసరఫరాలశాఖ కమిషనర్ తాజాగా జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం రాబోయే వానాకాలం సీజన్‌లో మిల్లర్ల నుంచి బ్యాంకు గ్యారంటీలు తీసుకోవాలని, ఆ తర్వాతే ధాన్యం కేటాయించాలని సూచించారు. ఈ సారి అండర్‌టేకింగ్ అవకాశం ఇవ్వ వద్దని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. డీఫాల్ట్ మిల్లర్లకు ధాన్యం కేటాయించ వద్దని స్పష్టంగా నిర్దేశించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 243 రైస్ మిల్లులుండగా, అందులో 27 మిల్లులు డీఫాల్ట్ మిల్లులుగా గుర్తించారు. ఈ మిల్లులకు రాబోయే సీజన్‌లో ధాన్యం కేటాయించవద్దని పేర్కొన్నారు. డీఫాల్ట్ అయిన మిల్లుల్లో సూర్యాపేట జిల్లాలో అత్యధికంగా 18 మిల్లులుండగా, నల్లగొండ జిల్లాలో ఏడు, యాదాద్రి భువనగిరి జిల్లాలో మరో రెండు మిల్లులున్నాయి. మిగిలిన మిల్లుల నుంచి సైతం బ్యాంకు గ్యారంటీలు తీసుకోవాలని ప్రభుత్వం సూచించింది. దీంతో కలెక్టర్లు మిల్లర్లతో సమావేశం నిర్వహించి ఈమేరకు బ్యాంకు గ్యారంటీలపై వివరించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. అయితే ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఇంకా సీజన్ ఆరంభం కాకపోవడం, అక్టోబర్ రెండోవారం నుంచి ధాన్యం వచ్చే అవకాశాలుండడంతో ఈలోగా మిల్లర్లతో సమావేశాలు జరిపే అవకాశం కనిపిస్తోంది. గతేడాది సూర్యాపేట జిల్లాల్లో మిల్లర్ల నుంచి కేటాయించే ధాన్యానికి సరిసమానంగా బ్యాంకు గ్యారంటీలు తీసుకున్న ప్రభుత్వం నల్లగొండ, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో మాత్రం అందుకు భిన్నంగా ఇక్కడ మిల్లర్ల సీఎంఆర్ కేటాయింపుల్లో పారదర్శకత, డీఫాల్ట్ లేకపోవడం వంటి కారణాలతో 10 శాతం బ్యాంకు గ్యారంటీతో ధాన్యం కేటాయించింది. ఈసారి ఎలాంటి ప్రతిపాదనలు చేస్తారనే అంశం మిల్లర్ల సమావేశం నిర్వహిస్తే కానీ తెలియడంలేదు.

గోదాములు ఖాళీ చేయకపోతే..

ఉమ్మడి జిల్లాలో ఈ సారి భిన్నమైన పరిస్థితి నెలకొంది. వానాకాలం సీజన్ తరుముకొస్తున్నప్పటికీ ఇంకా గోదాముల్లో నిల్వలు కదలకపోవడంతో మిల్లర్లు ఇవ్వాల్సిన యాసంగి.

– మిగతా 6వ పేజీలో...

నీలగిరిలో విద్యుత్ కాంతులు



నల్లగొండ పట్టణంలో డివైడర్లలో ఏర్పాటు చేసిన విద్యుత్‌లైట్లు

బతుకమ్మ పండుగ సందర్భంగా ప్రత్యేక సుందరీకరణ

రామగిరి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ పండుగ సందర్భంగా తొమ్మిది రోజులపాటు నీలగిరిలో ప్రత్యేక విద్యుత్ కాంతులు విరజిమ్మనున్నాయి. నేటి నుంచి దసరా పండుగ వరకు పట్టణంలోని ప్రధాన రహదారుల్లో వెలుగులు విరజిమ్మేందుకు ప్రత్యేక లైట్లను ఏర్పాటుచేశారు. నల్లగొండ పట్టణంలోని 48 వార్డుల్లో బతుకమ్మ ఆడేందుకు సుమారు 200 కేంద్రాలను గుర్తించి అక్కడ విద్యుత్ లైట్లు, పారిశుధ్యం వంటి ఏర్పాట్లను చేస్తున్నారు. ఎన్జీ కళాశాల మైదానంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ బతుకమ్మలను వల్లభరావు చెరువుకు తీసుకెళ్లేందుకు ట్రాక్టర్, ఆటోలు వంటి వాహనాలను కూడా ఏర్పాటుచేస్తున్నారు. వల్లభరావు చెరువు సమీపంలో బతుకమ్మలను నిమజ్జనం చేసేందుకు 20మంది ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటుచేశారు. వల్లభరావు చెరువులో దోమలు వృద్ధికాకుండా ఆయిల్‌బాల్స్ కూడా ఎప్పటికప్పుడు వేయనున్నారు.

బతుకమ్మకు ప్రత్యేక ఏర్పాట్లు



నల్లగొండలో పండుగ వాతావరణం ఉట్టిపడేలా ప్రధాన రహదారులతోపాటు బతుకమ్మ పాయింట్ల వద్ద ప్రత్యేక విద్యుత్ లైట్లను ఏర్పాటు చేస్తున్నాం. మహిళలు బతుకమ్మను ఆడిన తర్వాత వాటిని వల్లభరావు చెరువులో నిమజ్జనం చేసేందుకు ఆటోలను కూడా ఏర్పాటు చేశాం.

– సయ్యద్ ముసాబ్ అహ్మద్, మునిసిపల్ కమిషనర్, నల్లగొండ

బతుకమ్మకు తంగేడు పూల కొరత

- కానరాని తంగేడు, గునుగు, ముత్యాల పూలు
- బంతి, చామంతి పూల కొనుగోలుకే మహిళల మొగ్గు
- ప్రారంభమైన బతుకమ్మ సంబరాలు



తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తున్న బతుకమ్మ పండుగకు తంగేడు పూల కొరత ఏర్పడింది. ఇందుకు కారణం అడవులు, చెలకలు, బీడు భూములను చదునుచేసి వెంచర్లు చేయడంతో బతుకమ్మ పూలు కానరాకుండా పోయాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పలు మండలాల్లో తంగేడు పూలను చిన్నచిన్న కట్టలుగా కట్టి రూ.50లకు మూడు కట్టల చొప్పున వీధుల్లో విక్రయించారు.

(ఆంధ్రజ్యోతి-నార్కట్‌పల్లి)

సమావేశాన్ని విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పావులూరి హన్మంతారావు

రామగిరి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలోని బ్రహ్మంగారి మఠంలో ఈ నెల 28న జరిగే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి విశ్వబ్రాహ్మణ సంఘం సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, హార్టికల్చర్ జాయింట్ డైరెక్టర్ పావులూరి హనుమంతరావు కోరారు. జిల్లాకేంద్రంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రస్థాయి సమావేశంలో శ్రీశైలంలోని విశ్వబ్రాహ్మణ అన్నదాన సత్ర నిర్వహణ కమిటీ ఎన్నిక, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ వంటి అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబునాయిడు విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి కార్పొరేషన్ ఏర్పాటు చేసి, ఈశ్వరీ మాత దేవాలయ పునర్నిర్మాణానికి రూ.3కోట్లు కేటాయించారని తెలిపారు. సమావేశంలో స్వర్ణకార సంఘ జిల్లా అధ్యక్షుడు రాచకొండ గిరి, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు కొల్లోజు సత్యనారాయణాచారి, రాగిఫణి విష్ణుమూర్తి, కూరెళ్ళ మదనాచారి, దాసోజు వాసుభవాని, తాడూరి చెల్మయ్యాచారి, చొల్లేటి కృష్ణకుమార్, చొల్లేటి లక్ష్మణ్, కంచనపల్లి చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

చెర్వుగట్టుపై వైభవంగా లక్ష పుష్పార్చన

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని శైవక్షేత్రం చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దేవస్థానంపై ఆదివారం లక్ష పుష్పార్చన వేడుక వైభవంగా నిర్వహించారు. అమావాస్య తిథి సందర్భంగా నిర్వహించే ఈ ఉత్సవానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. తొలత గర్భాలయం నుంచి పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ మూర్తులను సన్నాయి వాయిద్యాలు, భక్తుల శివన్నామ స్మరణల మధ్య మహా మండపానికి చేర్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు పోతులపాటి రామలింగేశ్వరశర్మ, ఉప ప్రధాన అర్చకుడు సతీశ్‌శర్మ సహార్చకులు సురేశ్‌శర్మ, శ్రీకాంత్‌శర్మ, వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య విశేష పుష్పాలతో ఉత్సవమూర్తులను అభిషేకించారు. స్వామి పాదాల చెంత పూజలందుకున్న పుష్పాల కోసం భక్తులు పోటీపడ్డారు. స్వామి వారి పుష్కరిణిలో స్నానమాచరించి పార్వతీ జడల రామలింగేశ్వరునితో పాటు గుట్టపైన ఉన్న ఉపాలయాలు, గుట్ట కిందఉన్న పార్వతీ అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు.



మహామండపంలో ఉత్సవమూర్తులకు లక్షపుష్పార్చన నిర్వహిస్తున్న అర్చకులు

పెండింగ్ ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

కల్లుగీత సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అచ్చాలుగౌడ్



చిట్యాల మండలం గుండ్రాంపల్లిలో అనంతుల మల్లేశంగౌడ్‌ను పరామర్శిస్తున్న కల్లుగీత సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పామనగుళ్ళ అచ్చాలుగౌడ్

చిట్యాలరూరల్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న కల్లుగీత కార్మికుల ఎక్స్‌గ్రేషియాను వెంటనే చెల్లించాలని కల్లుగీత సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ జెడ్పీటీసీ పామనగుళ్ళ అచ్చాలుగౌడ్ డిమాండ్ చేశారు. మండలంలోని గుండ్రాంపల్లిలో ఆదివారం ఆయన తాటిచెట్టు పై నుంచి పడి గాయపడిన మల్లేశంగౌడ్‌ను పరామర్శించి మాట్లాడారు. కల్లుగీత కార్మికులు వృత్తినే జీవనాధారంగా చేసుకొని కుటుంబాన్ని పోషించుకుంటారన్నారు. తాటిచెట్టు ఎక్కి ప్రమాదవశాత్తు కిందపడితే వారికి ఎలాంటి జీవనాధారం ఉండదన్నారు. తాటిచెట్లు ఎక్కే గీతకార్మికులకు రక్షణగా ఉండే మోకులను అందించాలన్నారు. అర్హులైన కల్లుగీత కార్మికులకు పింఛన్లు మంజూరు చేయాలన్నారు. సంక్షేమ పథకాలను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం గ్రామ అధ్యక్షుడు బొడిగె అంజయ్యగౌడ్, ప్రధాన కార్యదర్శి బొడిగె రవీందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్ర ఆస్పత్రి సీనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్

ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్

నల్లగొండ, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్ర ప్రభుత్వాస్పత్రిలో సీనియర్ అసిస్టెంట్ కె. భార్గవ్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రభుత్వాస్పత్రిలో ఐసీయూ విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగ జీతాల చెల్లింపులో నిర్లక్ష్యం చేయడంతో సస్పెండ్ చేశారు. తమకు ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు జీతాలు రాలేదని జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని ఐసీయూలో పనిచేసే ఉద్యోగులు ప్రజావాణిలో దరఖాస్తు చేశారు. ఈ విషయంపై విచారణ చేయగా ఐసీయూలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంబంధించి అల్వా స్వయంశక్తి సంఘం కాంట్రాక్ట్ సయతః ఏడాది మార్చితో ముగిసింది.

2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కొత్త ఏజెన్సీకి కేటాయించడం లేదంటే, అదే ఏజెన్సీకి రెన్యూవల్ చేసే విషయంపై సీనియర్ అసిస్టెంట్ కె. భార్గవ జిల్లా ఉపాధి కల్పన అధికారికి ఎలాంటి ఫైల్ సమర్పించలేదు. ఈ నేపథ్యంలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల చెల్లింపులో నిర్లక్ష్యం చేసినందుకు సస్పెండ్ చేశారు. క్రమశిక్షణ చర్యల ప్రక్రియ పూర్తి అయ్యేంత వరకు సస్పెండ్‌లో కొనసాగుతారని ముందస్తు అనుమతి లేకుండా ఆయన కార్యస్థానాన్ని వదిలి వెళ్లకూడదని కలెక్టర్ ఆ ఉత్తర్వుల్లో కలెక్టర్ పేర్కొన్నారు.

రైతుల ఆశలపై నీళ్లు

- వరుస వర్షాలతో పత్తి రైతుల్లో ఆందోళన
- తెగుళ్లతో పంటలకు నష్టం



6

పేదల ఇళ్లల్లో వైద్యకాంతులు

నిరుపేద కుటుంబాల విద్యార్థులు చదువులో సత్తాచాటి ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రభుత్వ కళాశాలల్లో మెడికల్ సీటు సాధించి తల్లిదండ్రుల ఆశలు, ఆశయాలు నెరవేర్చారు. దీంతో వైద్య విద్య వారి దరికి చేరింది.

7

నవరాత్రి ఉత్సవాలకు..

తుల్జా భవాని ఆలయం ముస్తాబు

తొమ్మిది రోజులపాటు ఉపవాస దీక్షలతో గిరిజన భక్తుల పూజలు

దసరా ముందురోజే పండుగ ఉత్సవాలు

నేరేడుగొమ్ము, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): కోరిన కోర్కెలు తీర్చే దైవంగా నేరేడుగొమ్ము మండలం పెద్దమునిగల్ తుల్జా భవాని అమ్మవారికి పేరుంది. నవరాత్రుల ముందు రోజునుంచే గిరిజనులు ఉపవాసదీక్షలతో అమ్మవారికి పూజలు చేస్తారు. దసరాకు ఒకరోజు ముందు అక్టోబరు 1న దేవాలయంలో పండుగ ఉత్సవాలు జరుగుతాయి. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు, మాచర్లతోపాటు రాష్ట్రంలోని హైదరాబాద్, మహబూబ్‌నగర్, నల్లగొండ, నాగర్‌కర్నూల్, ఇతర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేసి మొక్కులు తీర్చుకుంటారు. కోరిన కోర్కెలు నెరవేర్చే దైవంగా తుల్జా భవాని అమ్మవారికి పేరుండడంతో గిరిజనులు కొన్నేళ్లుగా నిష్టతో ఉపవాస దీక్షలు చేసి, అమ్మవారిని పూజిస్తారు. మద్యం, మాంసాహారానికి దూరంగా ఉంటారు. ఎక్కువగా ఆవుపాలు, పండ్లు, శాఖాహారం తీసుకుంటారు. దసరా పండుగకు ముందు రోజు ఉపవాస దీక్షలు ముగుస్తాయి. తుల్జా భవాని దేవాలయాన్ని నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబు చేశారు. కృష్ణానదిలో శివాలయం నిర్మించారు. నదిస్నానం చేసి పూజలు చేస్తారు.

నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబైన పెద్దమునిగల్ తుల్జా భవాని దేవాలయం



ఐదు తరాల నుంచి అమ్మవారికి పూజలు



మాతాతలు ఐదు తరాల నుంచి తుల్జా భవాని అమ్మవారికి నిష్టతో పూజలు చేస్తున్నారు. నవరాత్రుల సందర్భంగా తొమ్మిది రోజులు ఉపవాస దీక్షతో పూజలుచేస్తాం. ఆవు పాలే తాగుతాం. కోరిన కోర్కెలు నెరవేర్చే దైవంగా తుల్జా భవాని అమ్మవారికి పేరుంది. భక్తులు అధికసంఖ్యలో వచ్చి మొక్కులు చెల్లించుకుంటారు.

– జీవన్‌భగత్, ఆలయ ప్రధాన అర్చకుడు

ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చడం సరికాదు

కొండమల్లేపల్లి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇష్టానుసారంగా ట్రిపుల్ ఆర్ అలైన్మెంట్ మార్చడం సరికాదని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమావత్ దస్రూ నాయక్ అన్నారు. ట్రిపుల్ ఆర్ ధర్నాకు వెళ్లకుండా పలువురు బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా దస్రూనాయక్ మాట్లాడుతూ అలైన్మెంట్ మార్చడం వల్ల రైతులకు నష్టం జరుగుతుందని అన్నారు. అరెస్టయిన వారిలో రమావత్ శ్రీనునాయక్, సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, పాండు ఉన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

దేవరకొండ, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా కార్యదర్శి సలికినేని జీవ, నియోజకవర్గ ఇన్‌చార్జి ఎర్ర ఆంజనేయులు అన్నారు. దేవరకొండలో ఆదివారం నిర్వహించిన అంబేడ్కర్ యువజన సంఘం ఆవిర్భావ వేడుకల్లో వారు పాల్గొని మాట్లాడారు. అంబేడ్కర్ సూచించిన బాటలో నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు అనిల్‌కుమార్, వెంకటయ్య, శేఖర్, పర్వతాలు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు కృషి



రాజు, సీఐ, నాంపల్లి

ఇంటర్వ్యూ Interview

చింతపల్లి మండలంలో శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకు ఎవరైనా ప్రయత్నిస్తే వారిపై తగిన చర్యలు తీసుకుంటామని నాంపల్లి సీఐ రాజు హెచ్చరించారు. దొంగతనాల నివారణ, ట్రాఫిక్ సమస్య పరిష్కారం, వాహనాల తనిఖీల గురించి ఆంధ్రజ్యోతి నిర్వహించిన ఇంటర్వ్యూలో ఆయన వివరించారు.

(దేవరకొండ, ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి: మండలంలో శాంతిభద్రతలు ఎలా ఉన్నాయి?

సీఐ: మండలంలో శాంతిభద్రతలు ఎంతో పదిలంగా ఉన్నాయి. ఎవరైనా విఘాతం కలిగిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం. నేరాల అదుపు, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసులకు సహకరించాలి.

ఆంధ్రజ్యోతి: చింతపల్లి మండలంలో దొంగతనాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

సీఐ: చోరీలు జరగకుండా ఉండేందుకు ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం. రాత్రివేళలో స్థానిక పోలీస్ సిబ్బందితో కలిసి గస్తీ నిర్వహిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: ట్రాఫిక్ సమస్యపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు? వీటీనగర్‌లో మంగళవారం సంత వల్ల ఏర్పడే ట్రాఫిక్‌కు ట్రాఫిక్ నియంత్రణకు ఎలాంటి చర్యలు చేపడుతారు?

సీఐ: ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగేలా రోడ్లపై వాహనాలు నిలిపితే హెచ్చరించడమే కాకుండా కేసులు నమోదు చేస్తున్నాం. వీటీనగర్‌లో చిరు వ్యాపారస్థులు రోడ్డుకు 40 మీటర్ల దూరం వ్యాపారాలు నిర్వహించుకోవాలి.

ఆంధ్రజ్యోతి: ప్రైవేట్ వాహనాల తనిఖీపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

సీఐ: సాగర్-హైదరాబాద్ ప్రధాన రహదారిపై వెళ్లే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహిస్తున్నాం. బ్రీత్ అనలైజర్ పరీక్షలు కూడా చేస్తున్నాం. అవసరమైన పత్రాలు లేకుండా తిరుగుతున్న వాహనాలకు జరిమానా విధిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: పరిమితికి మించి ప్రయాణికులతో వాహనాలు ఇష్టారాజ్యంగా తిరుగుతున్న వాటిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

సీఐ: సాగర్-హైదరాబాద్ రాష్ట్ర ప్రధాన రహదారిపై వెళ్లే వాహనదారులు కనీస నిబంధనలు పాటించాలి. నిబంధనలపై ఆటోవాలాలకు, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. పరిమితికి మించి జనాలను ఎక్కించుకోవడంతో పాటు అతి వేగంగా వాహనాలు నడిపితే వారిపై చర్యలు తీసుకుంటున్నాం.

ఉత్సవాలకు ముస్తాబైన మండపాలు

● ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు ● నేటి నుంచి దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

దేవరకొండ, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): దేవరకొండ పట్టణంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు వివిధ కాలనీల్లో కమిటీల నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. దేవరకొండ పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయం, 2వ వార్డు, మార్కండేయస్వామి దేవాలయంతో పాటు వివిధ కాలనీల్లో దేవి నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 22వ తేదీ నుంచి దేవి నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నారు. అందుకుగాను నిర్వాహకులు దుర్గాదేవి అమ్మవారి విగ్రహాలను హైదరాబాద్‌లో పాటు వివిధ ప్రాంతాల నుంచి కొనుగోలు చేసి తీసుకువస్తున్నారు. అందుకుగాను మండపాలతో పాటు ఏర్పాట్లను పూర్తి చేశారు.



దేవరకొండ రామాలయంలో దేవి శరన్నవరాత్రులకు ఏర్పాటు చేసిన మండపం



దేవరకొండ 2వ వార్డులో దేవి నవరాత్రుల కోసం ఏర్పాటు చేసిన మండపం

చింతపల్లి: దేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకొని సోమవారం దుర్గామాతను ఏర్పాటు చేసేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. చింతపల్లి, గొడకొండ, వీటీనగర్, పోలేపల్లిరాంనగర్, తక్కళ్లపల్లి, చాకిలిశేరుపల్లి, సాయిరెడ్డిగూడెం గ్రామాల్లో తొమ్మిది రోజుల పాటు నవరాత్రులను నిర్వహించడానికి మండపాలను ఏర్పాటు చేసి వైభవంగా అలంకరించారు. ఉత్సవాల్లో యువత దుర్గామాత దీక్షను తీసుకొని పవిత్రంగా పూజలు చేస్తారు.



మిర్యాలగూడ పట్టణంలోని డాక్టర్స్ కాలనీలో రోడ్డు మీదకు జరిగి ఏర్పాటు చేస్తున్న విద్యుత్ స్తంభం

రోడ్డు మధ్యకు చేరిన స్తంభం

(మిర్యాలగూడ టౌన్, ఆంధ్రజ్యోతి)

అసలే ఇరుకు రోడ్లు, ఆ పైన ఆక్రమణలు. ఇటువంటి పరిస్థితిలో ఓ విద్యుత్ స్తంభాన్ని రోడ్డు మీదకు జరుపుతున్నారు. పట్టణంలోని డాక్టర్స్ కాలనీలో ఓ విద్యుత్ స్తంభం కాస్త ఒరిగింది. సదరు స్తంభానికి మరమ్మతులు చేపట్టాల్సిన సంబంధిత ఉద్యోగులు నూతన స్తంభం ఏర్పాటుకు పూనుకోవడం మంచిదే. కానీ ఏర్పాటు చేస్తున్న విద్యుత్ స్తంభాన్ని రోడ్డు మీదకు తెచ్చారు. రెండడుగులు రోడ్డు వైపునకు జరిగి నూతన స్తంభం ఏర్పాటు చేస్తున్నారు. అసలే ఆటో కూడా దూరని రహదారిలో రోడ్డువైపునకు జరిపి స్తంభం ఏర్పాటు చేయడంలో అధికారుల అంతర్యమేమిటోనని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

లక్ష్మణ్‌బాపూజీ త్యాగం అజరామరం

● ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



బాపూజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే బీఎల్ఆర్

మిర్యాలగూడ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కొండా లక్ష్మణ్‌బాపూజీ త్యాగం అజరామరమని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా ఆదివారం ఎమ్మెల్సీ శంకర్‌నాయక్‌తో కలిసి సాగర్‌రోడ్డులో ఎల్ఐసీ భవనం ఎదురుగా ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆచార్య లక్ష్మణ్‌బాపూజీ కృషి మరువలేనిదని అన్నారు. 1969 తొలిదశ ఉద్యమంలో మంత్రివి పదవిని వదిలి రాష్ట్ర సాధనకు పాటుపడిన మహనీయుడని కొనియాడారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడని అన్నారు. రెండు ఉద్యమాల వారధిగా పనిచేసిన ఆయన తెలంగాణ ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడని అన్నారు. జీవితచరమాంకం వరకు నిరంతరం ప్రజాసేవకే పరిమితమయ్యారని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుకూరి బాలు, ప్రసాద్, భవాండ్ల పాండు తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు భాస్కర్‌రావు, విజయసింహారెడ్డి

● రాష్ట్ర సాధనే ధ్యేయంగా పదవులను త్యజించిన కొండా లక్ష్మణ్‌బాపూజీ ఆశయసాధనకు కృషి చేయాలని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు అన్నారు. బాపూజీ వర్ధంతి సందర్భంగా మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డితో కలిసి సాగర్ రోడ్డులోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలిదశ, మలిదశ ఉద్యమాల్లో లక్ష్మణ్‌బాపూజీ నిర్వహించిన పాత్ర అనిర్వచనీయమన్నారు. ఆయన ఆశయసాధనకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కోటేశ్వరావు, తిరందాసు విష్ణు, ఈశ్వరాచారి, సాంబశివరావు, ఆంజనేయులు, ఇతర నాయకులు చిలుకూరి శ్యామ్, పాండు, బాలు పాల్గొన్నారు.

హాలియా : ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని హాలియా మునిసిపాలిటీలో పద్మశాలి సంఘం అధ్వర్యంలో సంఘం అధ్యక్షులు కుకుడాల ఆంజనేయులు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి గడ్డం రమణయ్య, కోశాధికారి నామని సుదాకర్, చెరుపల్లి ముత్యాలు, కొంగరి శ్రీను, గడ్డం కృష్ణ ఉన్నారు.

ప్రపంచశాంతిని కాంక్షిస్తూ ప్రార్థనలు



ప్రార్థనలు చేస్తున్న ఫాదర్ హన్యానాయక్

మిర్యాలగూడ టౌన్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రపంచశాంతిని కాంక్షిస్తూ మెన్ అండ్ ఉమెన్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో విశ్వాస పరిచర్య ప్రార్థన మందిరంలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చి ఫాదర్ హన్యానాయక్ మాట్లాడుతూ ప్రపంచ దేశాల మధ్య శాంతి నెలకొనాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించినట్లు తెలిపారు. దేశాల మధ్య శాంతి, సామరస్యం నెలకొనాలని ప్రభువును వేడుకున్నట్లు తెలిపారు. వృద్ధ, దివ్యాంగులకు భగవంతుడు ఆయురారోగ్యాలు కలిగించాలని, పంటలు సమృద్ధిగా పండి రైతులకు లాభాలు చేకూరాలని ప్రార్థించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రమాబాయి, జనార్దన్, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

దాస్సి కుటుంబసభ్యులకు పరామర్శ



దాస్సి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

అడవిదేవులపల్లి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోన్యాతండాకు చెందిన పాతులోతు దాస్సి అనే మహిళ యూరియా కోసం వెళ్లి గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఆదివారం గ్రామానికి చేరుకొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి కాంగ్రెస్ పార్టీ, బీఎల్ఆర్ బ్రదర్స్ తరుపున రూ.2లక్షల ఆర్థిక సహాయం ప్రకటించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొదిల శ్రీనివాస్, స్కైలాబ్‌నాయక్, బాలు, బండి నాగేశ్వర్‌రావు, కుర్ర అశోక్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి రూ.20వేల ఆర్థిక సహాయం అందించారు. ప్రభుత్వం రైతుల సమస్యలను గుర్తించి వెంటనే రైతులకు సరిపడా యూరియా అందించాలని కోరారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, మాజీ ఎంపీపీ ధనావత్ బాలాజీనాయక్, మాజీ జడ్పీటీసీ కుర్ర సేవ్యానాయక్, నాయకులు పాతులోతు స్వామినాయక్, కుర్ర బీమానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మిర్యాలగూడ టౌన్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని స్ఫూర్తి ఉమెన్ ఫౌండేషన్ ఛైర్మన్ పందిర్ల పద్మావతి కోరారు. అమూల్య ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమని, జీవన శైలిలో మార్పుల ద్వారా ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చన్నారు. నిత్యం వ్యాయామం చేయాలని, ధ్యానం, యోగా సాధన చేస్తూ వైద్య నిపుణుల సలహాలు తీసుకుంటే రోగాలు దరి చేరవన్నారు. ఆస్పత్రి ఆధ్వర్యంలో ప్రతీ వారం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. డాక్టర్ ఎస్కే అన్వర్, పందిర్ల రాంమూర్తి, శివ పాల్గొన్నారు.

చందంపేట : లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని చందంపేట మండల బీఆర్ఎస్ నాయకులు రాజవర్ధన్‌రెడ్డి ఆర్థిక సహాయంతో ఆదివారం చందంపేట మండలంలోని పోలేపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల ప్రజలకు అన్ని రకాల ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. వారికి ఉచిత మందులతోపాటు తీసుకోవలసిన ఆరోగ్య జాగ్రత్తలను సూచించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు నీల బుచ్చయ్య, మల్లయ్య, రుక్మారెడ్డి, పద్మారెడ్డి, నారాయణరెడ్డి, నీలాద్రి హస్పిటల్ వైద్య బృందం డాక్టర్ పృధ్వీ, డాక్టర్ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతులకు యూరియా అందించడంలో విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న మారుతి వెంకట్‌రెడ్డి

మాడ్గులపల్లి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): యూరియాను రైతులకు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ సర్పంచ్‌ల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు మారుతి వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో యూరియా కోసం రైతులు రోడెక్కలేదని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల్లోనే యూరియా కోసం రైతులు నానాతంటాలు పడాల్సిన పరిస్థితి వచ్చిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అమలుకాని హామీలను ఇచ్చి ప్రజలను మోసం చేయడమే తప్ప వారు చేసిందేమీ లేదన్నారు. ఎక్కువ మంది రైతులు వెనుకకు నాట్లు వేయడంతో మొదటిసారి యూరియా వేయలేదని ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి మాడ్గులపల్లి మండలంలోని అన్ని గ్రామాల రైతులకు యూరియా సరఫరా చేయాలని డిమాండ్‌చేశారు. లేకుంటే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడ్తామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు నరేందర్‌రెడ్డి, పుల్లెంల ఏడుకొండలు పాల్గొన్నారు.

తండ్రికి కొరివి పెట్టిన కుమార్తె



తండ్రికి అంతిమసంస్కారం నిర్వహిస్తున్న కుమార్తె

కొండమల్లేపల్లి, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): తండ్రికి కుమార్తె తల కొరివి పెట్టిన ఘటన ఆదివారం కొండమల్లేపల్లి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. దేవరకొండ మండలం కొండబీమనపల్లి గ్రామానికి చెందిన అందుగుల శ్రీను (46)సుమారు 20 ఏళ్ల క్రితం బ్రతుకు దెరువు కోసం కుటుంబ సభ్యులతో వచ్చి కొండమల్లేపల్లి పట్టణంలో నివాసముంటున్నాడు. అతనికి ముగ్గురు కుమార్తెలు వారిలో ఇద్దరికి వివాహం అయ్యింది. ఈక్రమంలోనే శ్రీను గుండెపోటుతో మృతి చెందగా, అతని చిన్న కుమార్తె సిరి తల కొరివిపెట్టింది. మృతుడు శ్రీనుది పేద కుటుంబమని, కుటుంబ పెద్ద మరణించడంతో భార్య, కుమార్తె జీవనం కోసం ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని బంధువులు ప్రజలు కోరుతున్నారు.

సంక్షిప్తం...

హాలియా : అనుముల గ్రామానికి చెందిన బొమ్ము పూలమ్మ ఇటీవల మృతి చెందారు. దీంతో మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి ఆదివారం ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే అనుముల మండలంలో కుందూరు భరత్‌రెడ్డి ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ ఛైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, కాకునూరి నారాయణగౌడ్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

● హాలియా : మండలంలోని కొట్టాల గ్రామానికి చెందిన మార్కెట్ కమిటీ డైరెక్టర్ మొసంగి వెంకటేశ్వర్లు ఇటీవల గుండె శస్త్ర చికిత్స చేయించుకోవడంతో ఆదివారం వారి నివాసంలో ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి పరామర్శించారు. ఈసందర్భంగా వెంకటేశ్వర్లును ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. నాయుడుపాలెం గ్రామానికి చెందిన మోతీలాల్ ప్రమాదవశాత్తు కాలుజారి కాల్వలో పడి మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

● మిర్యాలగూడ టౌన్ : మునిసిపల్ మాజీ ఛైర్మన్ తిరునగరు భార్గవ్ తల్లి మల్లీశ్వరమ్మ సంతాప సభకు పట్టణ ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు, రైస్‌మిల్లర్స్ హాజరయ్యారు. ఎస్వీ గార్డెన్స్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్, మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు, రైతు సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాసరెడ్డి తదితరులు వేర్వేరుగా హాజరై మల్లీశ్వరమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ ఛైర్‌పర్సన్ నాగలక్ష్మీ భార్గవ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి నీరుకంటి నారాయణ, మిట్టపల్లి విజయభాస్కర్, తలకొప్పుల సైదులు, చీదళ్ల శ్రీను, బాసాని గిరి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి: ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు సముద్రాల నగేష్ డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువత స్వయం ఉపాధి పొందడానికి రాజీవ్ యువ వికాసం ఏర్పాటు చేసి నెలలు గడుస్తున్నా యువత ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడిందన్నారు. పింఛన్ పెంచుతామని హామీలిచ్చి రెండేళ్లవుతున్నా పథకాల అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు.

వైభవంగా ఎంగిలి పూల బతుకమ్మ వేడుకలు



దేవరకొండ: వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

దేవరకొండ, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): దేవరకొండ పట్టణంతో పాటు మండలంలోని గ్రామాల్లో ఎగిలి పూల బతుకమ్మ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించుకున్నారు. మహిళలు నూతన వస్త్రాలు ధరించి వివిధ రకాల పూలతో గౌరమ్మలను, బతుకమ్మలను పేర్చారు. సాయంత్రం పట్టణంలోని వాసవీకన్యకాపరమేశ్వరి ఆలయం, మార్కండేయస్వామిఆలయం, రామాలయం, అయ్యప్పస్వామి ఆలయం, కోదండ రామాలయాల వద్దకు బతుకమ్మలను తీసుకువచ్చి బతుకమ్మ ఆటలను మహిళలు ఆడారు. సంప్రదాయ పద్ధతిలో మహిళలు బతుకమ్మ పాటలు పాడుతూ ఆటలు ఆడారు. ఆలయకమిటీ నిర్వాహకులు దేవాలయాలలో బతుకమ్మ ఉత్సవాలకు విద్యుత్ అలంకరణతో పాటు ఏర్పా ట్లు చేశారు. బతుకమ్మలను రాత్రి వివిధ వాగులు, చెరువులలో వేసేందుకు మున్సిపల్ అధికారులు ఏర్పాట్లు చేశారు.



వేములపల్లిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

● చింతపల్లి : చింతపల్లి రాజరాజేశ్వరి, వేంకటేశ్వరనగర్, కుర్మపల్లి, గ్రామాల్లోని శివాలయాల్లో వద్ద చిన్నారులు, యువతులు, మహిళలు బతుకమ్మను పేర్చి సుందరమనోహరంగా తీర్చిదిద్దారు. సాయంత్రం ఆలయాల్లోకి చేరుకొని భక్తిశ్రద్ధలతో బతుకమ్మ ఉత్సవాల్లో పాల్గొన్నారు. దీంతో ఎక్కడ చూసిన మహిళల సందడి నెలకొంది.

● వేములపల్లి : మండలంలోని గ్రామాల్లో బతుకమ్మను అందంగా అలంకరించారు. అనంతరం గ్రామాల్లోని మహిళలు బతుకమ్మలతో గ్రామ కూడలికి చేరుకోని వాటిని ఒక దగ్గరగా చేర్చి బతుకమ్మ పాటలతో ఆడిపాడి వాటిని గ్రామ సమీపంలోని చెరువులు, కుంటలు, కాల్వల్లో వదిలి ఒకరినొకరు వాయినం ఇచ్చిపుచ్చుకున్నారు.

● కొండమల్లేపల్లి : మండల కేంద్రంలోని సీతారామాంజనేయ చంద్రమౌళీశ్వర అయ్యప్ప స్వామిఆలయంలో మహిళలు బతుకమ్మ ఆట ఆడారు. అనంతరం చెర్వుల్లో నిమజ్జనం చేశారు.

● పెద్దఅడిశర్లపల్లి : ఉమ్మడి పెద్దఅడిశర్లపల్లి మండలంలోని పీఏపల్లి, అంగడిపేట ఎక్స్‌రోడ్డు, మేడారం, వద్దిపట్ల, అజ్మాపురం, గుడిపల్లి మండలకేంద్రంతో పాటు, ఘనపురం, పోల్కంపల్లి, బీమనపల్లి గ్రామాల్లో తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ఆడారు. అనంతరం గ్రామాల్లోని పొలిమేరల్లో ఉన్న బతుకమ్మ తెప్పలలో నిమజ్జనం చేశారు.

● మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులు అందమైన బతుకమ్మలను పేర్చి సంప్రదాయ నృత్యాలతో అలరించారు. కార్యక్రమానికి హాజరైన ఎంఈవో లావూరి బాలు మాట్లాడుతూ సాంస్కృతీ, సంప్రదాయాలను ప్రతిబింబజేసే బతుకమ్మ పండుగ విద్యార్థులకు ఇష్టమైనదన్నారు. అనంతరం విద్యార్థులు పేర్చిన బతుకమ్మలలో ఉత్తమమైనవి ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంఘ సేవకులు రాపర్తి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ కేకే. జయరాజన్, వైస్ ప్రిన్సిపాల్ జిస్సీజయరాజన్, సుజయ్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అంగడిపేట ఎక్స్‌రోడ్డు వద్ద బతుకమ్మతో చిన్నారులు, కుటుంబసభ్యులు

సినిమా గైడ్ : మిర్యాలగూడ: శ్రీనివాస : కిష్కింధపురి, వెంకటేశ్వర: మిరాయ్, రాఘవ: భద్రకాళి, విట్రోస్: కిష్కింధపురి, లిటిల్ హర్ట్స్, మిరాయ్, దక్ష, భద్రకాళి, దేవరకొండ : మనోజ్ : లిటిల్ హర్ట్స్, మైత్రి వెంకటేశ్వర : మిరాయ్